(TELUGU)

Wonders in Literature: THE SERPENT

# సాహిత్యంలో 'సర్పం'


రచన :

ఎమ్. ఎస్. శాస్త్రి, బి. యస్. సి. (ఫార్మసీ)


దీవన :

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ


**J A Y A N I K E T A N**

TADEPALLIGUDEM (W. G. Dist.) | Branch Office: MADRAS-7.

# విషయానుక్రమణిక

CHECKED June 85

CHECKED 1992

దీవెన ... ... ...

రచనను గురించి ... ... ...

పుట

1 పాముల పండగ ... 9
2 పుట్టలో పాలు ... 10
3 పాములు : జాతులు ... 13
4 పాములు : బాలలు ... 15
5 మలబారులో నాగపూజ ... 17
6 పాము దేవుడి పేర్లు ... 20
7 పాములు : దేవుళ్లు ... 22
8 లక్ష్మీనారాయణ సంవాదం 24
9 శివరాత్రి ప్రభ ... 25
10 పాములు : బొజ్జయ్య ... 26
11 నాగానందం ... 28
12 పాములు: రెండు గాథలు ... 29
13 పాములు : కథల తీరులు ... 31
14 భూతసర్పాలు ... 32
15 శతకవాఙ్మయం: పాము ... 34
16 కరవని పాము ! ... 36
17 గుణదోష విచారణ ... 38
18 పాములు : పరమ సత్యములు 40
19 పాముల పెద్ద ... 43
20 ఆదిశేషువు పరాభవం ..
21 'మధుగానగర' కథనం ..
22 పాములు : జాతీయాలు ..
23 పాములు : లోకోక్తులు ..
24 పాములు : సామెతలు ..
25 పాములు : పోలికలు ..
26 పాము చెవులు : పాము కాళ్లు
27 పాములు : పొడుపు కథ ..
28 పాములు : నమ్మకలు ...
29 పాముల పుట్ట ...
30 సముద్రమథన కథ ...
31 కృష్ణపాదాలు ...
32 రెండు ఉపాఖ్యానాలు ...
33 పాములు : కవిత్వం ...
34 పాములు : చాటువులు ...
35 పాములు : సంగీతం ...
36 పాములు : స్థలమహిమలు ...
37 పాములు : పూజలు ...
38 కోరిన కోరికలు ...
39 పాముపడగ : అంతరార్థం ...

సుబ్రహ్మణ్య అష్టోత్తర శతనామావళి ... ...

సుబ్రహ్మణ్య కరావలంబన స్తోత్రమ్ ... ...

# దీవన:

చిరంజీవి యమ్. యస్. శాస్త్రి 'అమరగాథలు—అలెగ్జాండరు' అనే గ్రంథం రచించీ, తెలుగుపత్రికలకు ఎన్నో చక్కని వ్యాసాలు వ్రాసీ తెలుగు పాఠకలోకానికి ఇదివరకే సుపరిచితుడు. అమరగాథలవలెనే హృదయాన్ని అలరించే పుస్తకం అతని యీ 'సాహిత్యంలో సర్పం'. ఈ సర్పం మనలను కరిచేదికాదు; మనకెన్నో విషయాలు తెలిపి విజ్ఞానం కలిగించేది.

పామును చూడనివారు ఉంటే ఉండవచ్చును కాని దానినిగురించి విననివారు ఉండరు. ప్రపంచంలో పాములు లేని దేశమే లేదు. అటువంటప్పుడు పామునుగురించి విననివారు ఎవరుంటారు? పాటలలో, ప్రబంధాలలో, శతకాలలో, కథలలో, లోకోక్తులలో అన్నిటిలోను పామే. సాహిత్యసీమలో పాముకు చాలా పుట్టలున్నాయి.

మొత్తంమీద ప్రపంచంలో రెండువేల రకాల పాములున్నాయంటారు శాస్త్రజ్ఞులు. పాములు అన్ని దేశాలలోను ఉన్నా వాటిని దేవుళ్ళను చేసి ఇప్పటికీ ఎక్కువగా పూజిస్తున్నది మనదేశంలోనే అనుకుంటాను. నాగులొక్క పురాణాలలోనేకాదు, వేదాలలోను ఉన్నారు. మొదటిమారు వారి ప్రస్తావం యజుర్వేద అథర్వణవేదాలలో కనబడుతుంది. వేదాలలో ప్రవేశం కలిగింది గనుకనే యేమో వారికి పురాణాలలోకూడా స్థావరాలు చిక్కాయి.

నాగులు, గరుడులు, వానరులు, రాక్షసులు, అసురులు—వీరందరూ వేరువేరు జాతులవారంటారు మనుష్యశాస్త్రజ్ఞులు. భారతదేశంలో నాగులు చాలాచోట్ల ఉండినట్లు తెలుస్తుంది. అస్సాము దక్షిణభాగంలో ఉన్న నాగాయ్‌కొండలలో ఇప్పటికీ నాగజాతివారు కొందరున్నారు. వారు అనాగరకులు. కాశ్మీరదేశంలో అనాదికాలంనుంచీ నాగులుంటూ వచ్చినట్లు గాథలున్నాయి కాని ఆజాతివారు లేరు. అక్కడ ఒకచోటే కాదు, హిందూదేశంలో ఇంకా అనేకప్రాంతాల నాగులుండేవారని తెలుస్తున్నది.

ఆంధ్రులు నాగజాతివారంటారు. కృష్ణానది దక్షిణతీరాన న జాతివా రుండేవారని బౌద్ధగ్రంథాలవల్ల తెలుస్తుంది. ఎట్లా వచ్చిం తెలియదు కాని వేశ్యాసమూహానికి తెలుగులో నాగవాస మంటా నాగవాస మన్నది సంస్కృత సమాసము. మరి దీనికి సంస్కృతము వేశ్యాసమూహమనే అర్థం ఉన్నట్టు తోచదు.

బౌద్ధధర్మమంటే నాగుల కెక్కువ అనురక్తి. బౌద్ధమును ఎక్కువ ఆదరించి దాని నవలంబించినవారు—నాగులు. వారు బుద్ధునికి ప భక్తులు. బౌద్ధవాఙ్మయంలో నాగులకు సంబంధించిన గాథలు చా ఉన్నాయి. ఏలాపత్రనాగుడు, ముచిళిందనాగుడు మొదలైనవారు బౌ గాథలలో ప్రసిద్ధులు. ఏలాపత్రనాగునికి ఏలపత్రనాగుడని నామాం మున్నది. దిక్కులను పాలించే లోకపాలకులకు నాగులకుకూడా సంబ మున్నట్టు కనపడుతుంది. విరూపాక్షుడనే నాగరాజు తూర్పుదిక్కు పాలకుడనీ, ఏలాపత్రుడు పడమటి దిక్కుకు పాలకుడనీ బౌద్ధుల విశ్వా

ఒక్క సాహిత్యంలోనే కాదు, కళలోను పాము న్నది. శిల్పకళ పాము మరీ ఎక్కువ. అమరావతి నాగార్జునకొండ బౌద్ధ శిల్పాల ఎక్కడచూసినా నాగరాజుల నాగినుల నాగముల చిత్రాలే. శిల్పం ప్రాచీనాంధ్ర శిల్పులు నాగులను కటిప్రదేశంనుంచి పైభాగమంతా మ రూపంలోను క్రిందిభాగమంతా సర్పరూపంలోను చెక్కారు. నాగర చిత్రాలకు తలమీద అయిదు పడగ లుంటాయి. నాగినికి ఒక్కటే పడ అదయినా నాగకన్యక అని తెలియడానికే ఏమో. ఈ విధంగా స మనిషి, సగం సర్పం రూపంలో కాకుండా కేవలం మహాసర్పరూపం చెక్కిన చిత్రాలుకూడా లేకపోలేదు.

మన దేశంలో నాగపూజ అధికం. నాగప్రతిమలు చెక్కిన శిల సాధారణంగా ప్రతి చోటా కనబడుతాయి. వీటిని నాగశిలలనీ నాగక లనీ అంటారు. పుట్టిన బిడ్డలు చనిపోతూఉంటే సంతానం నిలవడానికి నా

ప్రతిష్ఠ చేసి ఆరాధించడం కద్దు మనలో. కొన్ని కొన్ని సుబ్రహ్మణ్యేశ్వ రాలయాలు ఇటువంటివే.

చిరంజీవి శాస్త్రి ఈ చిన్ని పుస్తకంలో సర్పమును గురించిన విశే షాలు ఎన్నో తెలిపినాడు. పాముకు సంబంధించిన లోకోక్తులు, కథలు, శత కాది వాఙ్మయశాఖలలో పామును సంబంధించిన సూచనలు - ఇవన్నీ చక్కగా విశదీకరించాడు. అన్నీ మనకు తెలిసినవే చాలావరకు; అన్నీ మనం వింటూఉన్నవే. కాని వాటి నన్నిటిని సేకరించి ఒక కూర్పులో సంత రించుటలో చక్కని నేర్పు చూపాడు. శాస్త్రి చిట్టచివరకె సర్పమును సుబ్ర హ్మణ్యేశ్వరుని చేసి, సర్వకార్యములు ఒనగూర్చే పరమ దైవముగా నిరూ పించి భక్తుల ఉపయోగము నిమిత్తము శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర అష్టోత్తర నామావళి, శ్రీ సుబ్రహ్మణ్య కరావలంబన స్తోత్రముకూడా ఈ పుస్త కంలో చివర చేర్చాడు.

చిరంజీవి శాస్త్రి ఇంకా ఎన్నో గ్రంథాలు వ్రాసి భాషాసేవ చేయా లనీ, పేరు గడించాలనీ కోరుతున్నాను. సర్వాభీష్ట ప్రదాయకుడైన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి శాస్త్రిని కామితార్థములిచ్చి కాపాడునుగాక !

24-12-53.

మల్లంపల్లి సోమశేఖరశర్మ

# రచనను గురించి :

అభివృద్ధికి మార్గాలు రెండు: కొత్త సంగతులు కనిపెట్టడం, వెనుకటి విషయాలను విస్మృతిలో పడకుండ చేయటం. రెండవ పద్ధతినే అవలంబనగా పెట్టుకొన్నాను ఇప్పటి నా రచనలకు.

ఈ రచనల తీరులో గల విశేషమొకటి: విషయాలు చాలవరకు అందరకూ తెలిసినవీ, చాలమంది విన్నవే ఐవుంటాయి. ఏర్చికూర్చి ఎదట పెట్టినప్పుడుమాత్రం విస్మయం కలిగించి తీరుతాయి.

'మాతృసేవ' పత్రిక ప్రోత్సాహాన 'సాహిత్యంలో జంతుజాలం' అనే వ్యాసాలు వ్రాస్తున్నప్పట్లో, మధ్యని నాగులచవితి తగిలింది. ఈ పర్వాన్ని పురస్కరించుకొని, పామునుగురించి అపారమైన విశేషాలు పది వ్యాసాలుగా ప్రకటించాను. వాటికి కొన్నికొన్ని విశేషాంశాలు చేర్చి మెరుగులు దిద్దిన రూపమే ఇది.

విలాసార్థం సాగించిన ఈ చిన్ని వినోదరచన శ్రీ సోమశేఖరశర్మగారి వంటి సుప్రసిద్ధుని 'దీవన'ను అందుకోగలగటమే దీని భావికి శుభ సూచకంగా భావిస్తున్నాను. ఇదే తొలిపరిచయమైనప్పటికీ, శ్రేయోభిలాషులు శ్రీ శర్మగారు నాపట్ల కనబరిచిన వాత్సల్యమూ, వారిచ్చిన ప్రోత్సాహమూ ఎన్నటికీ మరువలేను.

—శాస్త్రి



రచయిత

## నా గు లు — న న్న య

బహుభువనపాదపాబ్ధికుల పర్వతపూర్ణసరస్సరస్వతీ
సహితమహామహీభర మజస్రసహస్రఫణాళిఁ దాల్చి దు
స్సహతరమూర్తికిన్ జలధిశాయికిఁ బాయక శయ్యయైన య
య్యహిపతి దుష్కృతాంతకుఁ డనంతుఁడు మాకుఁ బ్రసన్నుఁ
డయ్యెడున్.

అరిది తపోవిభూతి నమరారుల బాధలు వొంద కుండఁగా
నురగుల నెల్లఁగాచిన మహోరగనాయకుఁ డానమత్సురా
సురమకుటాగ్రరత్నరుచిశోభితపాదున కద్రినందనే
శ్వరునకు భూషణం బయిన వాసుకి మాకుఁ బ్రసన్నుఁ
డయ్యెడున్.

దేవ మనుష్య లోకములఁ ద్రిమ్మరుచున్ విపులప్రతాప సం
భావితశక్తిశౌర్యులు నపారవిషోత్కటకోపవిస్ఫుర
త్పావక తాపితాఖిలవిపక్షులునైన మహానుభావులై
రావత కోటి ఘోర ఫణిరాజులు మాకుఁ బ్రసన్నులయ్యెడున్.

గోత్ర మహా మహీధర నికుంజములన్ విపినంబులం గురు
క్షేత్రమునం బ్రకామగతి ఖేలన నొప్పి సహాశ్వసేనుఁడై
ధాత్రిఁ బరిభ్రమించు బల దర్ప పరాక్రమ దక్షుఁ డీక్షణ
శ్రోత్రవిభుండు తక్షకుఁడు శూరుఁడు మాకుఁ బ్రసన్నుఁ
డయ్యెడున్.

—(ఆదిపర్వము : ప్రథమాశ్వాసము 104-107)

*     *     *     *     *

'పాములలోనైనా మెలగవచ్చుగాని స్వాములలో మెలగరాదు'

— ఒక లోకోక్తి.

# పాముల పండగ

దివ్వెలపండగ వెళ్ళిన నాలుగోనాడే మనకు దివ్యమైన పాముల పండగ. ఇదే 'నాగులచవితి.' ఈ రోజున ఉపవాసాలు చేస్తారు. చిమ్మిలి, చలిమిడి, పాలూ పట్టుకవెళ్ళి, పుట్టలో నాగమయ్యకు భక్తితో సమర్పిస్తారు. మొక్కులిడుతారు.

ఇలా, పాములను పూజించటానికని మన పూర్వులు ప్రత్యేకించి ఒకరోజు పర్వదినంగా ఏర్పరిచారంటే, అందులో ఎంతో అంతరార్థం ఉండేవుండాలి. నిజానికి, పాము చరిత్ర అతి చిత్రమైంది. అది సర్వవ్యాపి అంటే అతిశయోక్తి కాదు. ఏమిా!—తరచిచూడగా, పుట్టలో పాము, చెట్టుమిాద పాము, గుట్టమిాద పాము, చివరకు నడిసంద్రంలో పాము కనిపిస్తుంది.

ఎక్కడపడితే అక్కడ ప్రత్యక్షమయే ఈ పామును ఎలా తప్పించుకు తిరగటం?—సృష్టికర్తలైన హరిహరాదులకే వలను పడిందికాదు. మానవమాత్రునికా?—అందుకనే, ఆదికాలం నుంచీ మానవుడు పామును ప్రత్యేకించి ఒక ఉపాస్యదైవంగా ఆరాధిస్తూ వచ్చాడు. నిజంచెప్పాలంటే, ఈ నాగపూజ భక్తి వల్ల పుట్టుకవచ్చిందికాదు, కేవలమూ భయంచేతనే!

ఏమైతేనేం, పామును గురించిన విశేషాలు సారస్వతంలో ప్రముఖస్థానాన్ని సంపాదించుకున్నాయి. ఇవి ముఖ్యంగా మన తెలుగునాట ఉగ్గుపాలతో ఆరగింపైనవన్నా అనవచ్చు. ఎలా అంటే—పసిబిడ్డల్ని నిద్రపుచ్చే జోలపాటలలో, స్త్రీలపాట

లలో, ప్రాచీన వాఙ్మయంలో, ఆధునికుల గేయాల్లో, కథల్లో, కావ్యాల్లో, నాటకాల్లో, నవలల్లో—ప్రతి-చోటా పాము ప్రత్యక్షమవుతూనే వుంటున్నది.

## పుట్టలో పాలు

చూడగా—ప్రాచీన కవులకూ, అధునాతన కవులకూ ఒక్క-మోస్తరుగా కవితావేశం కలిగించింది పాము.

నాగులచవితినాడు పుట్టలో పాలుపోసుకుని తిరిగి వచ్చే టప్పుడు పడతులు—

బాలనాగులూ బమిడినాగులూ
కోలనాగులూ కొదమనాగులూ
బంగారపు నాగులూ!
వెన్నెటిని వస్తారు, చీకటిని వస్తారు
పడగ తొక్కితే పారిపోయి
నడుం తొక్కితే నావాళ్లనుకుని
తోక తొక్కితే తొలగిపోయి
కాచి రక్షించు తండ్రీ!
నాగేంద్రుడా! ఫణీంద్రుడా!!

అంటూ ప్రార్థించి, దణ్ణం పెట్టుకుంటారు.

ఇవే ఉద్దేశాలు, తెలుగువారి రక్తంలో కలసి ప్రవహించే ధోరణిలో అమరకావ్యంగా వెలువడింది, ధన్యజీవి మన బసవరాజు అప్పారాయకవి లేఖినినుండి:

నీ పుట్టదరికి నా పాపలొచ్చేరు,
పాప పుణ్యమ్ముల వాసనే లేని

బ్రహ్మస్వరూపులౌ పసికూనలోయి !
కోపించి బుస్సలు కొట్టబోకోయి !
నాగుల్ల చవితికీ, నాగేంద్ర, నీకు
పొట్టనిండా పాలు పోసేము తండ్రీ !

ఇంతవరకు, ముందుగా పసిపాపల పక్షాన కవి ప్రార్థించాడు నాగుమయ్యను. ఇది సమంజసమే. అటుతరువాత పెద్దవాళ్ళ మైన మనమాట. ఇందులో ముఖ్యంగా రాత్రిపూటలందే పని పాటులు నిర్వహించవలసిన రైతుజనం, వేళాపాళా లేకుండా ప్రయాణాలు చేయవలసివచ్చే బాటసారులు మున్నగు పెద్ద లంతా చేరతారు :

చీకటిలోన నీ శిరము తొక్కేము
కసి దీర మమ్మల్ని కాటెయ్యబోకు,
కోవపుట్టాలోని కోడెనాగన్న
పగలు సాధించి మా ప్రాణాలు దీకు !—నా॥

అని ఈవిధంగా విస్పష్ట వచనాలతో బతిమలాడాడు కవి. మానవులైన తరువాత, నోరులేని మూగజీవాలు—పాపం, పశువుల తరఫునకూడా నాగుమయ్యకు ఇలా విన్నవించు కొంటున్నాడు :

అర్ధరాతిరివేళ అపరాత్రివేళ
పాపమే మెఱుగని పసులు తిరిగేని,
ధరణికి జీవనాధారాలు సుమ్మ !
వాటిని రోషాన కాటేయబోకు !—నా॥

ఇటువంటి ప్రత్యేక ప్రార్థనలు కాగానే, మొత్తం ఉమ్మడిమీద మళ్లీ ఇలా వేడుకొంటున్నాడు :

అటు కొండ యిటు కొండ, ఆ రెంటి నడుమ
నాగుల్ల కొండలో నాట్యమాడేటి

దివ్యసుందర నాగ! దేహి యన్నాము
కనిపెట్టి మమ్మెపుడు కాపాడవోయి!—నా॥

చివరకు కొసరుగా—తనకు పంచప్రాణాలు ఐనటువంటి అర్థాంగిని గురించి ప్రత్యేకించి ఒక్కమాట—తాజాకలంలాటిది :

పగలనక రేయనక పనిపాటులందు
మునిగి తేలేటి నా మోహాలబరిణె
కంచెలూ కంపలూ గడిచేటివేళ
కంపచాటున నుండి కొంప దీకోయి!
నాగుల్లచవితికీ, నాగేంద్ర, నీకు
పొట్టనిండా పాలు పోసేము తండ్రి!

ఇంతకంటే ఎవడుమాత్రం ఎక్కువగా ప్రార్థించగలడు, నాగుమయ్య దయను సంపాదించడానికి? ఎన్నివిధాల మలిచి మలిచి, మంత్రాక్షరాలవంటి ఎన్నెన్నో రకరకాల పదాలు యుక్తి యుక్తంగా ప్రయోగించి, ఈ ప్రార్థనగీతికను కూర్చాడో బసవరాజు...!

పుట్టలో పాలు పొయ్యడమనేది ఆంధ్రులకు అత్యంతమూ ఆనందదాయకమైన పర్వం. ఈ సందర్భంలో మన బాలబాలికలు పుట్టలో నాగన్ననుగురించి కోలాటపు దరువులాగా లయ, తాళం వేసుకొంటూ ఎంచక్కా పాడుతున్నారో, చూడండి :

'నాగుల చవితికి నాగన్న
స్నాన సంధ్యలూ నాగన్న
పువ్వులు, పడగలు నాగన్న
మడి మట్టులతో నాగన్న
    చిమ్మిలి, చలిమిడి నాగన్న
    పాలూ, పండ్లూ నాగన్న

దివిటీ తేజున నాగన్న
ఉపవసించుతూ నాగన్న
ఉద్యాపించుతు నాగన్న
ఊరే గొత్రాం నాగన్న
పుట్టకు వత్తము నాగన్న
పూజలు గొనరా నాగన్న'

ఆహా!—లలితమైన చిన్ని చిన్ని పదాలతో మన చిన్నారిపాపలు పాడుకొనే ఈ పాట ఎంత ఇంపుగా వున్నది! ఎంత హృద్యంగా వున్నది!! నాగుల చవితినాడు జరగవలసిన తతంగమంతా ఈ నాలుగు మాటలలో యిమిడ్చివేశారు!

## పాములు : జాతులు

ఇన్నివిధాల ఇంతగా మనం ఆరాధించే పాము పలు జాతులుగా వుంటున్నది. పాము కాటువేస్తేసరి మరణిస్తామని భయపడతారు సామాన్యంగా. అదే పొరపాటు. పాములలో సవిషములు, నిర్విషములు అని రెండు రకాలున్నవి. వాటిలో రంగు రంగులు ఉన్నవి. చిత్ర విచిత్ర వర్ణాలుగా ఉంటున్నవి. మళ్ళీ వీటిల్లో పడగలు కలవీ, పడగలు లేనివీ అని తారతమ్యం కద్దు. ఇవి మెట్టలమీద, నీటిలోపల, మహారణ్యాలలోకూడా సంచరిస్తున్నవి.

పాములను గురించిన వింతలూ విశేషాలూ విజ్ఞాన విషయాలూ, వందలూ వేలూ కనబడతవి. వాటిని గురించిన సారస్వతం మన భాషలో అపారంగా ఉంటున్నది. ఇవన్నీ చెప్పటా

నికి ముందుగా పాములలో గల పలుజాతులను పేర్కొంటాను. శాస్త్రరీత్యా విభజింపబడిన పాములు మూడు విధాలు:

దర్వీకరములు, మండలములు, రాజీవంతములు.

ఈ మూడు విధాలలోనూ మళ్ళీ వరసన 14, 21, 26 రకాల జాతులున్నవి. మొదట చెప్పిన దర్వీకరములు ఇవి:

చింతనాగు, నాగజెర్రి, రేలత్రాచు, తెల్లత్రాచు, నల్లత్రాచు, శనగపూవన్నె త్రాచు, కందిపోడల త్రాచు, కోడిత్రాచు, ఆరికత్రాచు, గోధుమత్రాచు, మొగలిత్రాచు, రాచపాము, గిరినాగు, నీటిత్రాచు.

రెండవ రకానికి చెందిన 'మండలము'లనేవి:

ఉడుముపోడ, రక్తపోడ, కాటుకపోడ, కలంకారిపోడ, పొట్లపోడ, అగ్గిపోడ, తివాసిపోడ, పోడ, ఊదుపోడ, పిచ్చుకపోడ, సున్నపుపోడ, తేనెపోడ, కుళ్లుపోడ, గువ్వపోడ, శిఖండిపోడ (రెండు తలలు గలది) పసుపుపోడ, మోదుగుపోడ.

చిట్టచివర ఉదహరించిన 'రాజీవంతములు':

క్షుద్రసర్పములు: పెద్దకట్లపాము, న్యానెకట్లపాము, బల్రెకట్ల, నాగపురుగుడు, కట్ల చెట్టెగురుడు, గొడ్డలిముఖం గలది, గోడప్రాకుడు కట్ల, తాటికట్ల.

వైదేశికములు: పందిమొగముపాము, నెత్తురుమొగము పాము, గంటతోక, రెక్కలపాము, మూడుతోకలపాము, నిప్పుకండ్లపాము, బొచ్చుపాము, గొడుగుపాము.

మహాసర్పములు: కొండచిలువ, సముద్రపు చిలువ. తక్కినవన్నీ నిర్విషములు.

ఈ జాతులలో ఏ పాము ఏ స్వరూపంలో వుంటుంది? ఏది ఏరోజు విషాధిక్యం కలిగివుంటుంది? ఏ పాము కరిస్తే మరణం సంభవిస్తుంది? ఏది కరిస్తే బాధ కలుగదు? ఏ పాము కరిస్తే బాధ ఏవిధంగా పరిణమిస్తుంది? వాటివాటికి చికిత్స లేమిటి?— ఈ మొదలైన వివరాలు తెలుసుకోవాలంటే అదంతా సవాలక్ష గ్రంథముంది!

ఇంతవరకూ శాస్త్రంలో చెప్పబడిన వివరాలుమాత్రమే తెలుసుకొన్నాము. ఇవి గాక వాడుకలో ఉండే మరికొన్ని చిత్రమైన జాతులూ, వాటి వింతస్వభావాలనుగురించి అద్భుతమైన విశేషాలూ ఉన్నాయి.

## పాములు : బాలలు

—•—

'జో అచ్యుతానంద జో జో ముకుందా
రార పరమానంద రామ గోవిందా...జో జో
బలువైన ఫణిరాజు పాన్పు గావించీ
చెలులు డోలికలోన చేర్చి లాలించీ...జో జో'

ఇటువంటి తత్త్వబోధతో తెనుగింటి ఇల్లాలు జోలపాటలు పాడుతూవుంటే పసిబిడ్డలు తెలియకుండానే హాయిగా నిద్రిస్తారు. అలా నిద్రించటంలో ఆశ్చర్య మేముంది? పసిబిడ్డలే కాదు. ఆమాటకొస్తే పెద్దవాళ్లకే నిద్ర పట్టేస్తుంది.

జోలలకూ బాలలకూ పాములకూ సంబంధించిన పరమ సత్యాన్ని రెండేరెండు పాదాలలో యిమిడ్చాడు కవికుమారుడు:

'జోలల్లు పాడితే బాలలకు హాయి
నాగస్వరం ఊదితే నాగులకు హాయి'

అంటూ. ఈ మాటలనే—

'శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తిగానరసం ఫణిః॥'

అనే సంస్కృతశ్లోకోక్తి నిరూపిస్తున్నది.

తక్కిన సంగతులు అటుంచి, ఇప్పుడు పాముకు సంబంధించిన ఒక చిన్న లాలిపాటను గురించి ప్రస్తావిద్దాం:

యశోద బాలకృష్ణుణ్ని మాయమాటలతో మరపించి నిదురబుచ్చడానికి చూస్తున్నది. ఈ సందర్భాన్ని తెలుగు తల్లులు ఎంచక్కా చెబుతున్నారో చూడండి:

'అల్లదిగొ పాము వచ్చె, నాతండ్రి
గోపాల పవళించరా!
పాములకు రాజు తానె, శేషుండు
పానుపై యుండగానూ
పామేమి చేయునమ్మా, మా యమ్మ
భయము నీకేల నమ్మా!—'

ఊయలలో పసిపాపలు పాముపాట విని ఎలా హాయిగా నిద్ర చెందుతారో తెలుసుకున్నాము. వాళ్లు పెరిగి పెద్ద అవుతూ, ఆటపాటలలో మునిగివుండటంలో కూడా—

'గుడుగుడు కుంచం గుండారాగం
పాముల పట్టం పడగా రాగం'

అని ఈవిధంగా పాముఆటలు కూడా ఆడుతున్నారు. మన సారస్వతంలో ఇంతటి ప్రముఖస్థానాన్ని సంపాదించుకున్న పాముయొక్క నామాంతరాలలో కొన్ని ఇవి:

సర్పము—చరించునది

ఫణి, భోగి—పడగ కలది
ఉరగము—రొమ్ముతో ప్రాకునది
అహి—సంచరించేది
వ్యాళము—కరవటానికి యత్నించేది
పవనాశనము, గాలిమేపరి—గాలి మేతగా గలది
దందశూకము—కుటిలముగా కరిచేది

కాళము, భుజంగము, నాగము, పన్నగము, కాకోదరము—అని కూడా పేర్లు. పామును గురించిన పండగలూ పబ్బాలూ:

కార్తిక శుద్ధచవితి—నాగులచవితి
మార్గశిర శుద్ధషష్ఠి—సుబ్బారాయషష్ఠి.

ఈ షష్ఠి మంచి పర్వం. గొప్పగొప్ప తీర్థాలు జరుగుతవి. ఈ సందర్భంలోనే పిల్లలు ఎంతో ఉత్సాహంతో—

'సుబ్బారాయుడి షష్ఠి
చూచీ వత్తాం రండి'

అంటూ ఒకళ్లనొకళ్లు పిలుచుకపోయి, ఉత్సవంలో పాల్గొనబోతారు. నాగపంచమి, గరుడపంచమికూడా పాముకు సంబంధించిన పర్వాలే.

## మలబారులో నాగపూజ

పామును పూజించటం మనదేశంలో అనాదినుంచీ వస్తున్న ఒక సంప్రదాయం. మన తెలుగువాళ్ళకేకాదు. భారతదేశంలో చాలాప్రాంతాలలో, ఇది ఎక్కువగా అమలులో వుంటున్నది.

మచ్చుకి—మలబారుప్రాంతంలో నాగపూజనుగురించి వినతగిన విశేషాలు :

మలబారుదేశంలో నాగుమయ్యల్ని గురించిన నమ్మకలు మిక్కుటంగా వుంటున్నాయి. పాములుంటవని పసికట్టిన కొన్ని ప్రదేశాలు నిర్మానుషంగా ఉండిపోయి, అక్కడ చిన్నచిన్న అటవులు ఏర్పడటం కద్దు. అటువంటి చోటులందు నాగుమయ్య బొమ్మచెక్కిన శిలలు ప్రతిష్ఠించి పూజిస్తూవుంటారు.

అటవులందే కాదు, మలబారు ప్రాంతాన ఇంచుమించు ప్రతిపెరట్లోను ఇటువంటి శిల వుండితీరుతుంది. ఈ విగ్రహం ముందు సాయంకాలంపూట దీపారాధన చేస్తారు. ముఖ్యంగా హిందువులే ఇట్లా రోజూ పూజించేది.

హిందువులే గాక, తక్కిన వర్గాలవారున్ను పాముల యందు ప్రబలభక్తిని చాటుతూవుంటడం మెచ్చుతగిన విషయం. అందరూకూడా ఏడాది కొకసారి వచ్చే నాగపూజను ఎంతో భక్తిప్రపత్తులతో ఆచరిస్తారు.

మరే దేముడయినా ఫరవాలేదు కాని, సుబ్రమణ్యం మట్టుకి, కోపమొస్తే కుటుంబానికి తీరని హాని కలిగిస్తాడని చెప్పి, ఆ దేవుడిపట్ల అతి జాగరూకతతో నడచుకుంటారు మలబారీయులు. పాములు సంచరించే అటవీ ప్రదేశమందు, చెట్టున ఒక్క ఆకయినా చెయివేసి తుంపటానికి వారు జంకుతారు.

ఎక్కడైనా సుబ్రమణ్యేశుని గుళ్ళూ గోపురాలూ పాడు పడి వున్నట్టయితే, వాటిని పునర్నిర్మించి పూజా పురస్కారాలు

సాగిస్తారు. ప్రత్యేకించి ఈ సుబ్రమణ్యస్వామిని అర్చించే పూజారి కుటుంబాలు మలబారులో ఎన్నో వున్నయి.

పూజరోజున పూజారి పాలూ, కొబ్బెరనీళ్ళూ, పంచామృతాలూ, పువ్వులూ, అక్షతలూ మొదలైనవన్నీ తీసుకుని అడవికి వెళతాడు. ఒంకాయనూనెలో తడిపిన వత్తి వెలిగించి దీపారాధన చేస్తాడు. మంత్రాలు ఉచ్చరిస్తాడు. పాము విగ్రహాలు చెక్కబడిన ఆ రాళ్ళముందు పాలూ అవ్వీ వుంచి, వచ్చి ఆరగించిపొమ్మని నాగుమయ్యల్ని ప్రార్థిస్తాడు.

పూర్వయుగాలలో—ఇట్లా ప్రార్థించేసరికల్లా, పాములు వచ్చి పూజారి చేతిలోని పదార్థాల్ని ఆరగించి పోయేవట!

సర్పదేవుడి దయ సంపాదించుకునేటందుకుగాను హిందువులే గాక తదితరులు—అనగా మహమ్మదీయులూ, క్రైస్తవులూకూడా—పూజారిచేత పూజలు చేయించి, దీవనలందుకొంటూ వుంటారు.

మలబారు ప్రాంతీయులకు - ఏడాది కొకసారి జరిపిన ఈ పూజ చాలలేదనీ, దానితో నాగుమయ్య తృప్తిచెందలేదనీ, తోచిన పక్షమందు మళ్ళీ వొకసారి మంచిరోజు చూచి, మరింత బ్రహ్మాండంగా పూజా పురస్కారాలు జరుపుతారు. ఇంట్లో ఖుల్లాసా లేనప్పుడు అదంతా నాగుమయ్య కోపగించటంవల్లనే కలిగిందని మలబారుప్రజల గట్టి నమ్మకం.

ముఖ్యంగా నాగులచవితి నాగుపాములకోసం ఏర్పడింది. చెవిబాధలూ కంటిబాధలూ ఉన్నవాళ్లూ, సంతతి కోరుకునే స్త్రీలూ, పాముదేవుడికి మొక్కులు తీర్చుకుంటారు. సంతతి కలి

గితే ఆ దేవుడిపేరు పెట్టుకుంటామనే షరతుకూడా ఈ మొక్కుబడులలో వుంటుంది. నాగులచవితి పూజ సందర్భంలో పుట్ట నుండి మట్టి తీసుకుని చెవులకు పెట్టుకుంటారు. దీనికే 'పుట్ట బంగార'మని పేరు.

నాగులకు సంబంధించిన మొక్కుబడులలో ప్రత్యేకించి ఉపయోగించే వస్త్రాలున్నాయి. వీటిని ఎర్రటి గళ్ళతో నేస్తారు. ఇవి అంగాస్త్రి (నాగుల గావంచా) లుగా, చీరెలుగా ఎన్నో రూపాలలో వుంటాయి. వీటిని పర్వదినమందు ఒకసారి పుట్ట మీద పెట్టి, నాగుమయ్యకు నివేదించి, తరువాత ధరిస్తే మనసు లోని కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం.

## పాము దేవుడి పేర్లు

ఈ సందర్భంలో భక్తులు పెట్టుకునే పాముదేవుడి పేర్లు కొన్ని ఇక్కడ సూచితములవుతున్నవి :—

సుబ్బి, సుబ్బన్న, సుబ్బక్క, సుబ్బమ్మ, సుబ్బా రాయుడు, సుబ్రహ్మణ్యం, సుబ్బరామయ్య, సుబ్బారావు, సుబ్బులు.

నాగి, నాగులు, నాగన్న, నాగేశ్వరరావు, నాగమ్మ, నాగరాజు, నాగయ్య, నాగేంద్రుడు, నాగభూషణం, నాగోజి, నాగరత్నం.

పాపన్న, పాపమ్మ, పాపారాయుడు, పాపయ్య, పాప రాజు, పాపారావు.

శేషమ్మ, శేషన్న, శేషు, శేషగిరిరావు, శేషాద్రి, శేషాచలం.

భుజంగరావు, గురునాథరావు, అనంతం, పడగన్న, వెంకటశాయి, రంగశాయి, స్థలశాయి, శేషశాయి, తల్పశాయి, శాయన్న, శాయమ్మ—ఇలా మరి ఎన్నో.

పాముకు సరిబంధించిన ఇన్నిన్ని పేర్లు మానవులు పెట్టుకొని వ్యవహారం జరుపుకొంటున్నారంటే లోకంలో పాముకు గల విస్తృత ప్రభావం విదితమవుతూనేవుంది.

ఇలా మనుషుల పేర్లేకాదు. స్థలాలకూ, కొండలకూ, నదులకూ పాము సంబంధమైన పేర్లు ఉండటం గమనించవచ్చు. వీటిని, ఒక్కొక్కటిగా విమర్శించినట్టయితే వాటి పుట్టు పూర్వోత్తరాలూ, విశేషాలూ, గాథలూ వెల్లడి అవుతాయి:

నాగర్కోయిల్ - నాగూరు - నాగపట్నం - నాగపూర్ - నాగులాపల్లి - నాగాయలంక - సర్పవరం - పామూరు-నాగులేరు (నది) - నాగమలై (మధురజిల్లాలో కొండలు) - శేషాద్రి (తిరుపతి).

మన కవిసార్వభౌముడు తన పల్నాటిసీమ యాత్రలో చెప్పుకొనిన అనుభవాలలో ఒకటి యిది:

'చిన్నచిన్న రాళ్లు చిల్లర దేవుళ్లు
నాగులేటి నీళ్లు నాపరాళ్లు
సజ్జజొన్నకూళ్లు సర్పంబులును దేళ్లు
పల్లెనాటిసీమ పల్లెటూళ్లు'

'నాగులేరు' అనే నది ఈ పల్నాటిసీమలోదే.

ఇక - ఓషధులకూ, చెట్టుచేమలకూ పాము సంబంధమైన పేర్లు కొన్ని పేర్కొంటా :

నాగకేసరములు - నాగజిహ్వా-నాగతుందిల-నాగదొండ-నాగమల్లి - నాగబల - నాగపుష్పి - నాగార్జుని - నాగముషిణి - నాగముస్తెలు - నాగవల్లి - నాగదమని - నాగదంతి - నాగచంప - నాగగిలిగిచ్చ - నాగగోలుగు - నాగజెముడు - నాగగన్నేరు -నాగనేరేడు - నాగరంగము - నాగదాళి - నాగసుగంధ (సర్పాక్షి) సర్పగంధి మొదలైనవి.

ప్రకృతిలో ప్రతిదానికి పాముతో సంబంధమున్నదని ఇప్పటికి విశదమయింది. ఐతే - ఈ సంబంధం ఒక్క మానవులకేనా, దేవుళ్ళకూ-డా పాముల ప్రాపు వుందా?—పరిశీలిద్దాం.

## పాములు : దేవుళ్లు

—♦—

వైకుంఠపాళీ ఆటలో అన్నీ పాములే. అందులో పెద్ద పాము మింగిందంటే ఆటగాళ్ళ పని మళ్లీ మొదలుకే వస్తుంది. కనుక దాని నోట్లో పడకుండా తప్పించుకుందామనే చూస్తూ వుంటారు మానవులు. ఐతే, తప్పించుకోవటంమట్టుకు మహాకష్టం.

వైకుంఠవాసుడైన శ్రీమహావిష్ణువే పాము సంపర్కం తప్పించుకోలేక, దాన్ని పాన్పుగా చేసుకున్నాడు. అందుకే—

'శాంతాకారం భుజగశయనం'......

అని మనం శ్లోకం చదువుతున్నాం.

ఒక్క విష్ణువే కాదు. కైలాసంలో వసించే పరమశివుడూ పాము సంపర్కం లేకుండా ఉండలేకపోయాడు. శివభక్తులు ప్రార్థనలో :

'వందేశంభు ముమాపతిం సురగురుం
వందే జగత్కారణం వందే పన్నగభూషణం....'

అనికదా చెబుతున్నారు! శివుడు భుజగభూషణుడూ, భుజగ కంకణుడూకూడాను. ఈవిధంగా హరిహరు లిరువురూ పాముతో పొత్తుపెట్టుకున్న దైవాలే అని స్పష్టమవుతూవుంది.

పాముమీద పడుకొనివున్న విష్ణువుకే శేషశాయి, అనంతశయనుడు అని విశేషనామాలు. వేయి పడగలు గల ఆదిశేషువు విష్ణువుకు పాన్పు అయివున్నది. ఆదిశేషువు శరీరమంతా విష్ణువుకు శయ్యగా అమర్చి, పడుకొనివున్న ఆ మహానుభావునికి తన పడగలు గొడుగులుగా పట్టింది!

'పడగలు' అనేసరికి ఒకటిరెండు విషయాలు జ్ఞాపకానికి వస్తాయి : మానవుడు నిద్రిస్తూవుండగా ఒకొక్కప్పుడు పాము వచ్చి తలవద్ద పడగ పట్టిన సంఘటనలనుగురించి విన్నాము. అటువంటి మనిషికి జీవితంలో గొప్ప అదృష్టం పడుతుందని అంటారు.

రెండవది : కోటిరూపాయలు సంపాదించిన మానవుడు ఆ ధనానికి పడగ గల ఒక సర్పాకారపు బొమ్మను అలంకరించి, ఆ నిధిని కదపకుండా నిలవచేసి పూజించటం కద్దు. ఇలా చేయటాన్నే 'కోట్లకు పడగలెత్తడ' మంటారు.

# 'లక్ష్మీనారాయణ సంవాదం'

మళ్లీ ఒకసారి వైకుంఠానికి పోయి చూద్దాం: శేషుని మీద పవ్వళించే విష్ణువుకీ, ఆయన హృదయేశ్వరి ఐన లక్ష్మీదేవికీ మధ్యని ఒకప్పుడు పేచీ పడింది. దీనినే గోగులపాటి కూర్మనాథ కవి 'లక్ష్మీనారాయణ సంవాద' మనే కావ్యంగా అతి చమత్కారమైన తీరులో కల్పన చేశాడు. దీని యితివృత్తం ఇది:

ఒకరోజున విష్ణువు వైకుంఠంలో లక్ష్మిని ఒక్కర్తెనూ వదిలేసి భూలోకసంచారం చేయబోయాడు. ఆయన మళ్లీ వచ్చేసరికల్లా ఆమె అలిగికూర్చుంది. తిరిగివచ్చిన భర్త వాలకం చూచి అనుమానించింది. బదులుగా, విష్ణువు బుజ్జగించి నచ్చ జెప్పబోయాడు. ఏమైనా ఆమెకు నమ్మిక చిక్కలేదు. అప్పుడు భగవానుడు—

'జలముల జొత్తు, కుంభగత
సర్పము బట్టుదు, దీప్తవహ్నిలో
వెలగొని నిల్తు'...

అంటూ, ఇటువంటి కఠినపరీక్షలకు నిలుస్తా నంటాడు. 'కుండలో వున్న త్రాచుపామునైనా పట్టుకుంటా' ననేది ఈ పరీక్షలలో ఒకటి.

ఆవేశంతో విష్ణువు ఇలా శపథం పట్టాడేగాని ఈ శపథాన్ని అంగీకరించటానికి లక్ష్మి యేమంత అమాయిక కాదు. వెంటనే ఏమన్నది ?—

'కడలేని వెడగు పాల్కడలిపై బవళింప
గల నీకు జలముపై నిలుచుటెంత ?
కళల రాజిలు వేయితలల కుండలిమీద
పండు నీకొక పాము బట్టుటెంత ?'—

అనేసింది. ఈ ధోరణిలో నడిచిన 'లక్ష్మీనారాయణ సంవాదము' ఒక అమరకావ్యమై నిలిచింది.

## 'శివరాత్రి ప్రభ'

—♦—

శివుడికీ పాముకూ గల సంబంధం చెప్పినప్పుడు 'శివరాత్రిప్రభ' గేయం — మన కవికొండలవారిది — చెవిలో మోగుతుంది :

''కాలకంఠుని నాగసర్పము
కుబుస మూడ్చి పడగ బిస్సంది ;
రెండు నాల్కలు...
గండు మీసాలట్లు దూసింది ;
చెవులు మోసింది ;
నాగసార మూదేది యెవరోయి ?
రాగ మొలికించేది యెవరోయి ?
కాఱునల్లని కాళరాత్రి !...''

ఇక—శివుని కుమారుడూ, ఆదిదేవుడూ ఐన వినాయకుడికి పాముతోగల పరిచయం ప్రత్యేకించి పేర్కొనతగింది :

ఒకవంక త్రాచుపాములూ, మరొకవంక రత్నహారాలు గల అర్ధనారీశ్వరరూపం. బాల్యదశలో వినాయకుడు పాలు తాగుతూవున్న సమయం. త్రాచుపాముని చూచి తామరతూడు

అని భ్రమపడి అతడు తన తుండంతో ఆటలాడుతున్న ఘట్టం. ఈ ఘట్టాన్ని ఆంధ్రకవితాపితామహ అల్లసాని పెద్దన ఎంత అద్భుతంగా వర్ణించాడో :

'అంకము జేరి శైలతనయా స్తనదుగ్ధము లానువేళ బా
ల్యాంక విచేష్ట తుండమున నావలి చన్గబళింపబోయి, యా
వంక కుచంబు గాన కహివల్లభహారము గాంచివే మృణా
ళాంకుర శంక నంటెడు గజాస్యుని గొల్తు నభీష్టసిద్ధికిన్'

## పాములు : బొజ్జయ్య

—♦—

మొదటినుంచీ వినాయకుడికి ఎంత తినాలో తెలియదనే కద ప్రతీతి ! ఒకప్పుడు ఆయనకు కుడుములు ఎక్కువై పొట్ట విచ్చిపోయింది. ఉండ్రాళ్ళన్నీ దొర్లిపోయినై. వాటి నన్నింటినీ మళ్లీ ఎప్పటిలాగా పెట్టి వినాయకుడి పొట్టను, పాములను త్రాళ్లుగా చేసి కట్టారట! ఇందుకుగాను పదివేల పాములకు పైగా వినియోగింపబడినట్టు ఒకగాథ.

నాగపూజ చేసే భక్తులు మరణానంతరం నాగలోకానికి వెళ్తారని ఒక నమ్మిక. నాగలోకానికే పాతాళమనికూడా పేరు. అటువంటి పాతాళరాజ్యానికి ముఖ్యనగరు 'భోగవతి'. ఇంకిప్పుడు ఆ నాగుల పుట్టుపూర్వోత్తరాలను గురించిన కొన్ని గాథలు తెలుసుకొందాం :

ఒకప్పుడు కాశ్మీర్ లోయ జలపూరితమై వుండింది. తదుపరి, పరమశివుడు ఆ ప్రదేశాన్ని తనకు వాసయోగ్యంగా చేసుకున్నాడు. అక్కడనే కశ్యపప్రజాపతి భార్యలకు నాగులు,

పిశాచములు, యక్షులు, రాక్షసులూ పుట్టారు. ఇది ఉత్తర హిందూస్థానంలో ప్రచారమైవున్న గాథ.

పోతే, మనకు తెలిసిన పురాణగాథ :

కశ్యపబ్రహ్మకు కద్రువ, వినత అని ఇరువురు భార్యలు. కద్రువ కడుపున పాములు పుట్టినై. వినతకడుపున గరుడుడు జన్మించాడు. సవతు లిద్దరకూ సముద్రమథనకాలంలో జనించిన ఉచ్చైశ్రవమనే గుర్రపుతోక రంగునుగురించి పేచీ పడింది. ఒకామె తెలుపు అనీ, రెండవఆమె నలుపు అనీ పంతాలు పట్టారు. గెలిచినవాళ్ళకు ఓడినవాళ్ళు దాస్యంచేయాలని షరతు. అప్పుడు తల్లిమాటను నిలబెట్టటానికని నల్లగా వుండే ఒకపాము పోయి ఆ గుర్రంతోకను చుట్టేసుకుంది. వినత ఓడిపోయినట్టు వప్పుకోవలసి వచ్చింది.

తన తల్లి వినత దాస్యం చేయనక్కరలేకుండే షరతు మీద గరుడుడు అమృతం తెచ్చి పాములకు యివ్వటానికి అంగీకరించాడు. తెచ్చి దర్భలపై పెట్టేసి, తల్లిని విడిపించుకపోయాడు. ఈసంగతి తెలిసిన దేవేంద్రుడు పక్షిరూపంలో వచ్చి, పాములింకా తాకకుండానే అమృతం కాస్తా తన్నుకుపోయాడు. అలా తన్నుకుపోవటంలో ఒక్క అమృతబిందువు దర్భలమీద ఒలికింది. దానిని పాములు ఆస్వాదించబోయినై. వాడిఐన దర్భల వల్ల వాటి నాలుకలు రెండుగా చీలిపోయినై.

గరుత్మంతుడికి, తన తల్లిని పరాభవించిన పాములపైన కసి ఉండనేవున్నది. అతడు విష్ణువుకు వాహనమై ఉండటంవల్ల పాములను చంపటానికి భగవానుని అనుజ్ఞ తీసుకున్నాడు.

ఈ విధంగా, పాములకి నాలుకలు చీలిపోవటం, వాటికి గరుడునితో వైరం ఏర్పడటం—అనే రెండు ఘట్టాలు విశద మవుతున్నయి.

## 'నాగానందం'

—•—

ఈ గాథలు రెండూ మనల్ని 'నాగానందం' అనే గొప్ప కథలోకి కొనిపోతున్నవి. దీనిని శ్రీహర్షుడు నాటకంగా రచించి వున్నాడు. ఈ నాటకానికి యితివృత్తం:

పాములపై పగబట్టిన గరుడుడు పాతాళంలో రోజూ ఒకపాము చొప్పున చంపుతూవచ్చాడు. శంఖచూడుడు అనే పామువంతు వచ్చేసరికి వాని తల్లి దుఃఖింపసాగింది. అప్పుడు జీమూతవాహనుడు అనే రాజకుమారుడు తాను బలి కావటానికి తయారుపడ్డాడు. గరుడుడు వచ్చే సమయానికి ఇతడు కదలక మెదలక ఉన్నాడు. శంఖచూడుడు పరుగెత్తుకుంటూవచ్చి 'బలి కావలసినవాడను నేను, అతడు కాదు' అంటూ ఎలుగెత్తి అరిచాడు. గరుడుడు నిజం తెలుసుకుని, అమృతం తెచ్చి జీమూతవాహనుని బతికించాడు. జీమూతవాహనుని కోరిక ప్రకారం గరుడుడు ఇంతవరకు తాను పొట్ట పెట్టుకొన్న పాములన్నిటినీ కూడా అమృతం చిలికి బతికించి, నాటినుంచీ వాటిని చంపనని మాట యిచ్చాడు.

దీనిని బట్టే—చీనాబ్ లోయలోని వాసుకి ఆలయాలలో సర్పరాజు పక్కని జీమూతవాహనుడి విగ్రహంకూడా

తప్పనిసరిగ నెలకొల్పబడి వుంటున్నది.

ఇటువంటి మహత్తరమైన సర్పజాతిలో పేర్కొనవలసిన పెద్దలు—వీరినే మన పురాణాదులు 'అష్టనాగములు'గా పేర్కొంటున్నవి :

అనంతుడు (శేషుడు) - వాసుకి-తక్షకుడు-శంఖపాలుడు-కులికుడు-పద్మడు-మహాపద్మడు-కర్కోటకుడు.

ఐతే-నాగేంద్రుడు, కాళింగుడు-వీరినికూడా ఈ వర్గంలో చేర్చవచ్చు.

## పాములు : రెండు గొప్ప గాధలు

పాముకి సంబంధించిన గొప్ప గాథలు మన వాఙ్మయంలో అత్యంత ప్రముఖమైనవి రెండు : బాలనాగమ్మకథా, ధర్మాంగద పాటా. ఎవళ్ళకైనా ఇవి వళ్ళు జలదరింపజేసే అద్భుత గాధలు. చూడండి : బాలనాగమ్మ కథలో—

రాణి లక్ష్మీదేవమ్మను పాము కరిచింది. అప్పుడు మంత్రులు ప్రభువువారితో ఏమని మనవిచేసుకొంటున్నారంటే:

"భూమిలోపల పాము కరచితే అంతా చస్తారా॥ తందానతాన॥
అమ్మకు యింకా భయము లేదు రాజా॥ తందానతాన॥
పట్టపుదేవి బ్రతుకుతుంది రాజా॥ తందానతాన॥
మంత్రగాడినీ పిలిపించినారు॥ తందానతాన॥"

*　　*　　*　　*

పోతే—మంత్రగాడు రాణీవారికి మంత్రిస్తున్నారండి. అది యెట్లా అంటేనూ—

"నాగ దిగురా నాగ దిగురా — నా మనవి చేకొనరా॥
దిగు దిగు దిగు నాగ — దివ్యసుందర నాగ
ముదముతో రేపల్లె ముద్దులనాగ — నాగ దిగురా॥
వ॥ తోకను తొమ్మన్నూరు ముత్యాలు గల నాగా,
పక్కన పదివేలు పొడలు గల నాగా,
వీపున యేనూరు పూసలు గల నాగా,
పాలపొంగువంటి పడిగెలు గల నాగా,
పడిగలమీద చిన్నికృష్ణు పాదములు గల నాగా—నాగ దిగురా॥
నిండు పున్నమనాడు — పండువెన్నెల నాగ
సర్వగ్రహణము పట్టి — చందమామను మింగి
యిలలోన నీపేరు — యింపొందంగా నాగ
నాగ దిగురా — నాగ దిగురా"

ధర్మాంగద చరిత్ర : 'ఈ కథ అభూతకల్పనలతో నిండి వున్నదని పండితుల అభిప్రాయము. సత్యాసత్యముల వివాద మెట్లున్నా ఈ పాటమాత్రము చాలా కాలమునుంచీ ప్రచారములో ఉన్నది. కార్తీకమాసములో నాగచతుర్థినాడు ఈ పాటను స్మరించని వారుండరు. స్త్రీ జీవితములో దీక్ష ఎంతటి ఘనకార్యములనైనా చేయించగలదను నమ్మకమును పుట్టించ గల కథ యిది. మానవులకు పాము పుట్టటమూ, తలిదండ్రుల దుఃఖమూ, మంత్రి ఆలోచనా, అమాయకురాలైన బాలికను దానికి వివాహము చేయటము, ఆ బాలిక పాముతో పుణ్య క్షేత్రములన్నీ తిరిగి—పతికి మానుషరూపము నిప్పించటమూ మొదలైన అద్భుత కరుణారసముల నొలికించే గాథ యిది' అని శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవిగారు వాకొంటున్నారు.

# పాములు : కథల తీరులు

కథాసారస్వతంలో పాములకు సంబంధించిన కొన్ని తీరులు: "రాజపుత్రి కడుపులో వుండి, రాత్రివేళ రెండు ముక్కులలోనుంచీ రెండుపాములు రావటం, పక్కలో ఉన్న రాజకుమారుణ్ని కాటువేయటం, ఇలా చాలామంది చనిపోయిన తరువాత—సాహసుడూ, యుక్తిపరుడూ ఐన ఒక రాజకుమారుడు ఆ పాముల్ని చంపి, రాజకుమార్తెను పెళ్ళాడటం"— ఈ విధానం 'నాలుగు శ్లోకపాదాలు' వంటి కథల్లో కనబడుతుంది.

"రాజపుత్రిని యువరాజు పెండ్లాడటం చూచి ఓర్వలేక సవతులు, దాసీలు—దుస్తులు ఆభరణాలు మార్చుకుని నీళ్లలో నీఅందం నాఅందం చూచుకొందామని వంకబెట్టి నూతిలోకి తోసివేయటం—ఆ నూతిలో ఎన్నాళ్లనించో పెద్ద పుండుతో నాగుపాము బాధపడుతూ వుండి—రాజకుమారి నూతిలో పడటంతో పుండు చితికి బాధ నయమవటం— అప్పటినుంచీ నాగేంద్రుడు ఆమెను పుత్రికా భావంతో చూడటం—చివరకు యువరాజు (భర్త)తో పునస్సమాగమం"—ఇలాటి ఇతివృత్తం 'మిన్నాగులు' మొదలైన పెక్కు కథల్లో కనిపిస్తుంది.

"తల్లిపక్షీ, తండ్రిపక్షీ ఆహారం తేవడానికి గూడు వదలిపోగా కనిపెట్టి—పక్షిపిల్లలను తినడానికి వస్తూన్న నాగుపామును చూచి ఒక రాజకుమారుడు చంపటం—ఆ ఋణం

తీర్చుకొనేటందుకు పక్షులు అతనికి సహాయం చేయటం"— ఇటువంటి సంవిధానము 'బాలనాగమ్మ' వంటి కథల్లో అగపడుతుంది.

సవతిబిడ్డల సందర్భంలో పాములను వండిపెట్టడం కద్దు. స్త్రీల వ్రతకథల్లో పాముల కథలు మెండు.

ధనసంపదలనూ, విలువయిన వస్తువులనూ పాములు కాపలా కాసినట్టు ప్రాచీన సాహిత్యంలో ఎన్నో తార్కాణలున్నవి. మరణించిన శ్రీమంతుడు మళ్ళీజన్మలో పాముగా పుట్టి తను పూర్వజన్మలో గడించిన సొత్తును కాపాడుకొంటూ వుంటాడని ఒక నమ్మిక. మన పూర్వులు ఏర్పాటుచేసిన 'నిధి నిక్షేపాలు' అనే సంప్రదాయమే ఈ నమ్మికకు ఆధారం.

## భూతసర్పాలు

—♦—

ధనసంపదలకు కాపలాకాయటం మాటకేం—పాములే సహజంగా ధనసంపదను కలిగి వుంటున్నాయి. ఇవే వెలలేని మణులు. వీటికోసమే వీరులూ, శూరులూ సాహసచర్యలు జరిపిన గాథలు మన సారస్వతంలో కొల్లలుగా వుంటున్నాయి.

ఆబాలగోపాలానికీ ఆనందదాయకమైన సిందుబాద్ కథలో—'వజ్రాలలోయ'ను భయంకరమైన కాలసర్పాలు కాపాడుతూ వుంటాయి.

గ్రీకు పురాణాల్లో భూతసర్పాల (Dragon) వృత్తాంతం చదివితీరాల్సిందే. హెస్పరిడిస్ తోటలో బంగారు రేగుపండ్లను

పరిరక్షించే మహాసర్పానికి నూరు తలలున్నాయట! జేసన్ కథలో 'బంగారు ఉన్ని'ని రక్షించేది మరొక భూతసర్పం.

ఈనాడూ మనం కళ్లారా చూడగల కొన్ని సంఘటనలు:

శ్రీగంధపు మానులను సర్పాలు చుట్టుకొని వుండటం చేతనే వాటికి అంత విలువా, ఘనతానూ.

మొగలి డొంకలలో 'మొగలినాగు' ఉంటుంది. కను కనే పువ్వులు తీసేటప్పుడు అతి జాగ్రత్తగా వుండాలి.

అలాగే మల్లిపొదలలోకూడా 'మల్లినాగు' అనే ప్రత్యేకజాతి ఆశ్రయించుకు వుంటుందని వాడుక.

కాపలా కాసే పాములుమాత్రమే కాక తదితర జాతులు:

'నగ్న' అనే సంస్కృతపదం నించి 'నాగ' అనే మాట వచ్చింది. నాగులలో జాతులు కొన్ని—కోడెనాగు; కొండ నాగు; ఆకునాగు; పూనాగు; ఎండ్రినాగు; శంకునాగు; గోధుమ నాగు; చింతనాగు; తాటినాగు; సంపెంగనాగు; ఉలవనాగు; ఉల్లినాగు; తెల్లత్రాచు; నల్లత్రాచు (కృష్ణసర్పము).

ద్రవిడులు మరికొన్ని సర్పజాతులను అదనంగా గుర్తించారు: బాపన (ఎర్ర) నాగు; శెట్టినాగు: (ఇది పరుగెత్తి పోయేటప్పుడు భిడియపడినట్టు తలఎత్తి పక్క-పక్క-లకి చూస్తూ వుండటాన్నిబట్టి ఈపేరు వచ్చిందని చెపుతారు.) ఇవి కాక కొమ్ము వున్న పాము; ఎగిరే పాము; కట్లపాము; కొండచిలువ; బురదగొద్దు; పసరికపాము; నూనెపరుగుడు; జెర్రిపోతు; రెండు తలల పాము; తాడిల్లిపాము; పొడపాము; రక్తపింజరి.

నాలుగుకాళ్ళపాము ఒకటి వున్నది. దీనినే 'సల్లికెళ్ళ

పాము' అంటూవుంటాము. ఇది వ్రాదిన చోట వళ్ళు ఉబ్బుతుందని చెబుతారు. అయితే నల్లికెళ్లపామూ, వానపామూ కూడా పాముజాతిలో చేరవు.

## శతకవాఙ్మయంలో 'పాము'

మన శతకవాఙ్మయంలో పాముసంబంధమైన చిత్రాలు అపారములు, అగాధములున్ను. మానవజీవితంలో చక్కా-పోలికలు తెచ్చి పొదిగి చెప్పటానికి సుమతిశతకకర్తకు పాము బాగా పట్టినట్టు కనబడుతుంది. శతకంలో మొత్తం రెండు పుంజీల పద్యాలయినా ఒక్క పాముప్రసక్తితోనే నడిచినై.

'ఉడుముండదె నూరేండ్లును
బడియుండదె పేర్మిబాము పదినూరేండ్లున్
మడువున గొక్కెర యుండదె
కడు నిల బురుషార్థపరుడు కావలె సుమతీ॥'

ఉడుము నూరేండ్లు ఉంటుంది. పాము వేయేండ్లు ఉంటుంది. మడుగునందు కొంగ కలకాలం ఉంటుంది. అని ఈ విధంగా వాటివాటి వయస్సులు ఉదహరిస్తూ, 'కాని, ఏమి ప్రయోజనం ?—మానవజన్మ ఎత్తినందుకు ఫలంగా పురుషుడు ధర్మార్థ కామమోక్షాలను సాధించాలిగాని' అని అడుగుతున్నాడు.

* * * *

తరువాత—

ఎల్లప్పుడూ తప్పులే వెదికే దొరను ఆశ్రయించి చేసే నవు

కరీ ఎటువంటిదంటే—పాముపడగ నీడని బతికే కప్పలాగా ఎప్పుడో ఒకప్పుడు ఆపద వచ్చే తీరుతుంది అని చక్కగా పోల్చాడు. ఇక్కడ పాము దొరగానూ, కప్ప నవుకరుగానూ పోల్చబడ్డారు :

'ఎప్పుడు దప్పులు వెదకెడు
నప్పురుముని గొల్వకూడ దది యెట్లన్నన్
సప్పంబు పడగనీడను
గప్ప వసించిన విధంబు గదరా సుమతీ॥'

జీవితంలో తప్పించుకో వీలులేని దుఃఖకరమైన కొన్ని హంశాలను ఇలా పేర్కొంటున్నాడు సుమతి :

'కప్పకు నొరగాలైనను
సప్పమునకు రోగమైన, సతి తులువైనన్
ముప్పున దరిద్రుడైనను
దప్పదు మరి దుఃఖమగుట తథ్యము సుమతీ॥'

బాగా వుంది !—కప్పకు కాలు విరగటం, పాముకు రోగం రావటం, భార్య గయ్యాళికావటం, ముసలితనంలో దరిద్రం - ఇవి దుఃఖకరాలు గాక మరేమిటి ?

*    *    *    *

మరొక యాదార్థ్యం ఎంచక్కా చెప్పాడో చూడండి :

'కరణము సాదైయున్నను
కరి మదముడిగినను బాము కఱవకయున్నన్
ధర తేలు మీటకున్నను
గరమరుదుగ లెక్కగొనరు గదరా సుమతీ॥'

బాధ కలిగింపలేని కరణాన్ని, మదము లేని ఏనుగును, కరవనేరని పామును, కుట్టని తేలునూ లోకంలో, ఎవరు లక్ష్యంచేస్తారు ?—'ఎవళ్లూ చెయ్యరు' అని భావం.

# కరవని పాము!

—•—

ఇందులో 'కరవని పాము' అనేసరికి ఒక చిన్న కథ జ్ఞాపకానికి వస్తున్నది :

ఒకప్పుడు నారదమహర్షి ఒక అరణ్యంలో సంచారం చేస్తూఉండగా భయంకరమైన ఒక నాగుపామువచ్చి 'మహాత్మా! నాకు తరణోపాయం అనుగ్రహించు'మని వేడుకొన్నది. అప్పుడా ఋషి 'ఐతే, ఇటుపై నీ వెవరినీ కరవబోకు' అని ఉపదేశంచేసి వెళ్లిపోయాడు.

కొంతకాలానికి నారదుడు ఆ దారినే మళ్లీ రావటం తటస్థించింది. ఈసారి మళ్లీ ఆ పాము ఋషిదర్శనం చేసికొని 'మహానుభావా!—నీవు చెప్పినట్టుగానే ఆనాటినుంచీ ఎవళ్ళనూ కరవకుండా ఉన్నాను. కాని, నా సాధుత్వం చూచి చిన్నబిడ్డలుసైతం నన్ను వెంబడించి రాళ్లురువ్వి చంపుతున్నారు. ఏమిటి గత్యంతరం మహాత్మా!' అన్నది.

అందుకు నారదముని 'ఓసీ వెఱ్ఱిదానా!—నీతో కరవవద్దని చెప్పానుకాని, బుసకొట్టవద్దన్నానా?' అని కీలకంచెప్పి అంతర్హితుడయ్యాడు.

* * * *

లోకంలో నమ్మటానికి వీలుకాని కొన్ని విషయాలను వివరిస్తూ, పాముగురించికూడా ఇలా ప్రస్తావించాడు 'సుమతి':

'కోమలి విశ్వాసంబును
బాములతో చెలిమి యన్యభామల వలపున్

వేముల తీయదనంబును
భూమీశుల నమ్మికలును బొంకుర సుమతీ॥'

ఆడుదాని నమ్మకం, పాముతో స్నేహం, పరస్త్రీల అనురాగం, వేపచెట్టు తీయందనము, రాజుల వాగ్దానాలు—ఇవన్నీ నమ్మరానివే.

* * * *

'చీమలు పెట్టిన పుట్టలు
పాముల కిర వైనయట్లు పామరుఁడు దగన్
హేమంబుఁ గూడఁబెట్టిన
భూమీశుల పాలఁ జేరు భువిలో సుమతీ॥'

చీమలు కష్టపడి పెట్టుకొన్న పుట్టలలో పాములు అయాచితంగా వచ్చి దూరుతవి. అలాగే, అనుభవం తెలియని లోభులు కూడబెట్టే ధనం రాజులకు చేరుతుందని భావం.

* * * *

'తలనుండు విషము ఫణికిని
వెలయంగాఁ దోఁక నుండు వృశ్చికమునకుం
దల తోఁక యనక యుండును
ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ॥'

పాముకు విషం తలయందు, తేలుకు కొండియందు వుంటుంది. పోతే, దుష్టుడికి ?—నిలువు నిష్పాదమూ విషపూరితమే !!

* * * *

లోకాన్ని లెక్కచేయని గర్వపోతులగురించి ఎంతో యుక్తియుక్తంగా చెప్పాడు ఈ పద్యం :

'బలవంతుఁడ నాకేమని
పలువురతో నిగ్రహించి పలుకుట మేలా

బలవంతమైన సర్పము
చలిచీమలచేతఁ జిక్కి చావదె సుమతీ॥'

సహజంగా పాము బలమైందే. ఐతే యేం, అంత బలమైన పామూ వందలుగా చలిచీమలు పట్టి చిక్కించుకొన్నప్పుడు కిక్కురుమనలేదు; చచ్చి వూరుకుంటుంది. అలాగే బలం కలవాడినని చెప్పి మానవుడు గర్వించి దుర్బలులతో విరోధం పెట్టుకుంటే, ఆ దుర్బలుల బలగం ఎక్కువయినప్పట్లో అంతటి బలశాలీ చచ్చి వూరుకుంటాడన్నమాట.

## పాములు : గుణదోష విచారణ

—•—

మణిని ధరించిన ఫణికీ, విద్యావంతుడైన దుర్జనుడికీ పోలుస్తూ ఎంత చక్కగా చెప్పాడో భర్తృహరి :

'విద్యచే భూషితుం డయి వెలయుచున్నఁ
దొడరి వర్జింపనగుఁజుమీ దుర్జనుండు
చారుమాణిక్య భూషిత శస్త మస్త
కంబు గల పన్నగము భయంకరము గాదె'

ఈ ఉద్దేశాన్నే మరొక రూపంలో వివరిస్తున్నాడు జగన్నాయక శతకకర్త—వరహగిరి కొండరాజామాత్యుడు :

'అరయం గ్రూరవిచారుఁ డెంత ఘనవిద్యావంతుఁడైన న్నిరం
తరముం బ్రాజ్ఞులు వానితోడి చెలిమిం దర్కింప రెట్లన్న భీ
కర సర్పంబు ఫణామణిద్యుతులతోఁ గన్పట్టినం దానితో
దిరుగం గోరునె చెల్మి నెవ్వఁడయినం దేవా జగన్నాయకా॥'

*     *     *     *

'అదృష్టవంతుని చెరిపేవారు లేరు, దురదృష్టవంతుని

బాగుచేసేవారు లేరు' అనే లోకోక్తిని సమర్థిస్తూ 'దైవపద్ధతి' లో భర్తృహరి చెప్పిన పద్యరత్నం కావాలన్నా మరువలేము :

'రాతిరి మూషకంబు వివరం బొనరించి కరండబద్ధ మై
భీతిలి చిక్కి యాస చెడి పెద్దయు డస్సిన పామువాత సం
పాతముఁ జెందె దానిఁ దిని పాము దొలంగె బిలంబుఁ ద్రోవనే
యేతఱి హానివృద్ధులకు నెక్కటి దైవమ కారణంబగున్.'

*   *   *   *

దుష్టుని ప్రోత్సహించటం 'పాములకు పాలుపోసి పెంచడంవంటి'దనే వృద్ధేశాన్ని వెల్లడించని కవి లేడు. మచ్చుకి :—

'తాలిమితోడఁ గూరిమిఁ గృతఘ్నున కెయ్యెడ నుత్తమోత్తము
ల్మే లొనరించినన్ గుణము మిక్కిలి కీడగుఁ బాముపిల్లకున్
బాలిడి పెంచిన న్విషము పాయఁగ నేర్చునె దాని కోరలం
జాలఁగ నంతకంత కొక చాయను హెచ్చునుగాక భాస్కరా !'

(భాస్కర శతకము)

'నీచునకుఁ జేయు నుపకృతి నీచమగును
గాని మేల్గాదు భువి పన్నగములకెంత
పాలుఁ బోసిన విషమయి బలియవటవె
మథితగజదనుజాయ నమశ్శివాయ.'

(నమశ్శివాయ శతకము)

'కండచక్కెరయును గలియఁ బాల్పోసిన
తఱిని పాము తన్నుఁ దాకుఁగాదె
కపట మున్నదానిఁ గన్పట్టవలెనయా
విశ్వదాభిరామ వినుర వేమ.'

(వేమన)

'గడ్డిమేసి యావు కమ్మని పాలిచ్చు
బాము విషముఁగక్కు పాలు ద్రావి
యోగ్యులకును ధర నయోగ్యులకును భేద
మిట్లె యుండు సుమ్మి యెంచిచూడ'

అని ఒక నీతిపద్యం. ఈ మాటకే తమిళభాషలోకూడా ఒక సామెత వుంది :

'కడిత్తపాంబుక్ పాల్ వార్తాల్ విషత్తె తరుం।
అదుపోలె పొల్లాదవర్క్కు సెయ్యుం ఉపకారం యిరుక్కుం॥'

అంటే : 'పాముకి పాలుపోస్తే విషం కక్కుతుంది. దుష్టులకి చేసే ఉపకారంకూడా అలాగే వుంటుంది' అని భావం.

## పాములు : కొన్ని పరమ సత్యములు

ఎవ్వారికైనా విధివిధానం తప్పదు అనే పరమ సత్యాన్ని నిరూపించటానికని, పరీక్షితును గురించిన పౌరాణికగాధను వాకొంటున్నాడు, భాస్కర శతకకర్త :—

''కారణమైన కర్మములు కాక దిగంబడ వెన్ని గొందులం
దూఱిన నెంతవారలకుఁ దొల్లి పరీక్షితు శాపభీతుఁడై
వారిధి నొప్పు నుప్పరిగపైఁ బదిలంబుగ డాఁగియుండినన్
గ్రూర భుజంగదంతహతిఁ గూలఁడె లోకులెఱుంగ భాస్కరా॥''

* * * *

దుర్జనునితో చెలిమి పాముతో పొందువంటిదని తాళ్ళపాక తిమ్మనార్యుడు తన వేంకటేశశతకంలో వర్ణిస్తాడు :

'పాముతో నటు పొందు పాటింపఁగారాదు
దుర్జన సంగతి దూఱుముట్టు'

ఇటువంటి దుష్టమైన పామును లొంగదీయగల ఓషధినిగురించి ఈ కవీశ్వరుడే ఎంత చక్కటి పోలికలతో వర్ణించాడో:—

'ఏనుఁగులా వెంత యిల మావటీఁ డెంత
తిమిరంబు బల మెంత దీప మెంత
ఘనసముద్రం బెంత కర్ణధారకుఁ డెంత
బహుకాననం బెంత పరశు వెంత
పాతెడు నీ రెంత పర్వతం బది యెంత
హరుఁ డెంత మృదులపుష్పాస్త్ర మెంత
భీకరఫణి యెంత వాకట్టు వే రెంత
బహురాజ్య మెంత భూపాలుఁ డెంత
యెవ్వరికి పెద్ద కొంచెంబు లెంచరాదు
నడచు నిటువంటి వెల్ల నీ నాటకములు
కవితలక్ష్మీశ సర్వజగన్నివేశ
విమల రవికోటిసంకాశ వేంకటేశ॥'

* * * *

వేంకటేశ శతకకర్త పాముతత్వాన్ని మనకు పలు రూపులలో కనబరుస్తున్నాడు. ఒక చిన్న విషయం ఎత్తుకొంటే మనసుకు నాటేటట్టుగా దాన్ని బలపరిచే పోలికలు వందలూ వేలూ గుప్పటం ఈ కవి ప్రత్యేకత.

సామాన్యంగా క్రూరులే లోకంలో ఎక్కువగా ఉంటున్నట్టు ప్రజలు అనుకొంటారు. కాని, అపారమైన క్రూర సంతతికి నశింపూ ఎక్కువే అనే యాదార్థ్యాన్ని వెల్లడించడానికి ఎన్ని ఉదాహరణలు చెబుతున్నాడో ఈ మహాకవి :—

'పులిసి యేఁటేఁటఁ బల్మఱును గూనలఁ బెట్టుఁ
గంటిమా ధరఁ బిల్లి కదుపు నొకటిఁ
బాము గ్రుడ్లను బెట్టుఁ బదియు నిర్వదియును
బ్రతికెనా భూమిపైఁ బౌఁజు లగుచుఁ
బులులు పిల్లల నీనుఁ బొసఁగ నాల్గును నైదు
నున్నవా మందలై యుర్వియందు

మకరంబు లెన్నైన మడుగులలోఁ బుట్టు
　　　నెగడెనా గుంపులై నేలమీఁదఁ
గ్రూర సంతతి వెలయునే కొంచెపడక
విరివిగా ధర్మసంతతి వెలసినట్లు
కవిత లక్ష్మీశ సర్వజగన్నివేశ
విమల రవికోటి సంకాశ వేంకటేశ॥'

*　　*　　*　　*

'మానవుడు ఎంత గొప్పవారిని సేవించినప్పటికీ, అతనికి ఎంత ప్రాప్తమో అంతే లభించునుగాని అధిక ఫలము కలుగదు' అనే భావాన్ని చెపుతోంది—'అణిముత్యాల'లోని ఈ క్రింది పద్యం:

'మనుజుం డెంతటివారి గొల్చినను సంప్రాప్తిగా నున్న జీ
వనమాత్రమ్మె లభించుగాని తుద కప్రాప్తమ్ము ప్రాప్తమ్మె గా
వనిలంబింతకు శౌరికిన్ శయన యోగ్యంబౌచు; గౌరీశ భూ
షణమై యొప్పిన యాదిశేషునకు భోజ్యంబయ్యె! రాఘేశ్వరా!'

*　　*　　*　　*

ఉదారులయిన ప్రభువులవద్ద 'కొణుసుల'వంటి అంతరంగికులు చేరి, కవిపోషణకు అడ్డుతగలటమనేది అనాదినుంచీ వస్తున్న ఒక ఆచారం. ఈ బాధకు పాల్పడిన కవిశిరోమణులు ఎందరో ఉండేవారు, ఉంటున్నారు, ఉంటారు. ఇటువంటి ఒక 'తుట్టపురుగు' పెట్టిన బలికి ఆహుతి కావలసివచ్చింది మల్లికార్జున శతకకర్త. ఆయన తన ఆవేదనను ఇలా వెల్లడిస్తున్నాడు:

'గంధపుజెట్టుక్రింద నురగంబు పయోనిధి బాడబాగ్ని, మా
కందఫలంబు క్రింద నొక కందురుదుంప జగద్విలోకనా
నందము మేఘునందుఁ బవి నాఁచినమాడ్కి నకారణంబుగా
నుందురు దాతసన్నిధి నయోగ్యులు కొందఱు మల్లికార్జునా!'

'శరభాంకలింగమా' అనే మకుటంతో శతకం రచించిన మహాకవి పామును గురించిన కొన్ని లోతువిషయాలను మన ముందు పెడుతున్నాడు :

'గారుడ మంత్రసిద్ధుఁ డురగంబులచేఁ గఱపించుకొన్నఁ ద
ద్ఘోర విషంబు లెక్కవఁట కుంభినిలో శివమంత్రసిద్ధుఁడై
జారవినోదియై విషయసంగతిఁ జెందినఁ జెందుఁగాక యా
పూరిత మోహపాశములఁ బొందఁడయా శరభాంకలింగమా!'

అపారమైన మన శతకవాఙ్మయంలో పామునుగురించిన కొద్దిపాటి ప్రస్తావన ఇది.

సాధారణంగా మనం 'పాము' అనేసరికి దానికి వెంటనే దుష్టత్వం ఆపాదిస్తాం. ఇది పొరపాటు. మానవజాతిలో దుష్టులూ శిష్టులూ ఎలా ఉంటున్నారో అలానే పాముజాతిలో కూడా పేర్కొనదగిన పెద్దలూ ఉన్నారు. పాములన్నీ దుష్టమైనవి కావు. వాటిల్లో మేలుచేసేవీ వున్నాయి—కీడు చేసేవీ వున్నాయి.


## పాముల పెద్ద

ఇప్పుడు—అనాదిగా మనం వింటూవుండే ఆదిశేషువును గురించి మొట్టమొదట తెలుసుకుందాం:

ఆదిశేషువు విష్ణుమూర్తికి 'శయ్య'గా ఏర్పడ్డాడు. ప్రళయసమయంలోకూడా ఆదిశేషుడు జీవించిఉన్నాడనీ, ప్రళయానికి తరవాతకూడా ఉంటున్నాడనీ పురాణాలు చెబుతున్నాయి. అటువంటప్పుడు మిగిలేది శేషువొక్కటేకదా! శేషువు

మీూద విష్ణువు పడుకొని ఆజ్ఞాపిస్తూవుంటే బ్రహ్మదేవుడు మళ్ళీ సృష్టికార్యానికి పూనుకుంటాడన్నమాట.

ఈ ఆదిశేషుడు భూభారాన్ని యావత్తు వహిస్తున్నట్టు చెబుతారు. దీనినే భర్తృహరి—'భువనశ్రేణి వహించు



శేషుఁడు ఫణాభోగంబుపై' అనగా—'పదునాలుగు లోకాలనూ ఆదిశేషుఁడు తన పడగలచేత మోస్తున్నాడు' అని వర్ణిస్తున్నాడు.

ఇలా ఆదిశేషువు భూగోళాన్ని మోయటాన్నిగురించి 'భాస్కరశతక'కర్త హెచ్చుస్థాయిలో వినుతిస్తున్నాడు :

'తనకు ఫలంబు లేదని యెడం దలపోయఁడు కీర్తి గోరు నా
ఘన గుణశాలి లోకహితకార్యము మిక్కిలి భారమైన మేఁ
లనుకొని పూను శేషుఁడు సహస్రముఖంబుల గాలిఁ గ్రోలి తా
ననిశము మోవఁడే మఱి మహాభరమైన ధరిత్రి భాస్కరా॥'

ఇంతటి భారాన్ని వహించే ఆదిశేషుడికీ వాయుదేవుడికీ, ఒకప్పుడు పటుపట్టాంగం వచ్చింది. ఎలా అంటే—మేరుపర్వతం మీది వెయ్యి శిఖరాలనూ ఆదిశేషువు తన వెయ్యి పడగల తోనూ కాపాడుతున్నది. ఆ పడగలను విడిపించి, దాని శిఖ రాలను పడగొట్టటానికని యత్నిస్తున్నాడు వాయుదేవుడు. కొంతసేపైన తరవాత వాయుదేవుడు అలసిపోయాడు. వాయువు ఎక్కడున్నాడో అనిచెప్పి ఆదిశేషువు ఒక పడగ ఎత్తి తొంగి చూచింది. ఆమట్టున వాయుదేవుడు ఆ శిఖరాన్ని పడగొట్టే సరికి, అది తిన్నగా వెళ్లి "తిరుపతి"లో పడింది !

## ఆదిశేషువు పరాభవం

—♦—

ఈ విధంగా పరాభవం చెందిన ఆదిశేషువు సహించ లేక 'వరాహగిరి'పైన ఘోరతపస్సు ప్రారంభించింది. ఆ తప స్సుకు మెచ్చి దేవుడు ప్రత్యక్షంకాగా, 'నేను వాయువును జయించాలి' అని ఒక్కటేఒక్క వరం కోరుకొన్నది.

అప్పుడు దేవుడు 'సరే. వాయువు నీకు ఆహారమగు గాక !' అని వరమిచ్చి అంతర్ధానమయ్యాడు. ఈ కారణం చేతనే ఈనాటికీ ఆహారం అక్కరలేకుండా పాముజాతి గాలి

వల్లనే బతుకుతూవున్నది. దీనినిబట్టే పాముకు 'గాలిమేపరి' 'పవనాంధము' అనే పేర్లు వచ్చాయి.

తిరుపతిక్షేత్రాన్ని శేషువు సంపర్కంవల్లనే శేషాచలం (శేషాద్రి) అంటున్నారు. తిరుపతి వేంకటేశ్వర్లు ఏడుకొండల వాడు కద! ఈ ఏడుకొండలూ ఆదిశేషుడి ఏడుతలలుగా తలంపబడుతున్నయి. ఐతే, దీని తోక శ్రీశైలంలో వున్నదట! —అది మరివక చిత్రగాథ.

ఆదిశేషుడికి వెయ్యితల లుండుటచేతనే బుద్ధివిశేషంలో ఆధిక్యత కలవాడని ప్రతీతి. ఆదిశేషుడికే అనంతుడు, నాగడు అని మరిరెండు పేర్లున్నాయి.

పురాణప్రసిద్ధుడైన ఈ ఆదిశేషుడు నిగర్వచూడామణి అని చెప్పే ఒక చాటువును ఇక్కడ ఉదహరించటం అప్రస్తుతం కానేరదు :

'విషభర సహస్ర వదనముల్ వెలసియున్న
శేషు డెప్పుడు గర్వంబు చెందబోడు
బిందుమాత్ర విషంబున్న వృశ్చికంబు
కొండి పై కెత్తుకొని పరుగులు వహించు.'

## 'మధురానగర' కథనం

—♦—

'మధురము' అంటే తియ్యన. దీన్నిబట్టి 'మధుర' అనే పట్టణంలోకూడా ఏదో వక తియ్యందన మున్నదని మనం భావించవచ్చు. అందులోనూ తియ్యదన మున్నమాట వాస్త

వమే. అయితే, ఆదిలో ఆ ప్రదేశం హాలాహాంతో నిండివుండేదట. హాలాహాలం 'పాము'కి సంబంధించింది గదా! విషపూరితమైన 'పాము'కూ, తీయని 'మధుర'కూ పొయరాని సంబంధమున్న దని విన్నప్పుడు విస్తుపోతాం. చిత్రమైన ఆ స్థలపురాణం ఇది :

పూర్వకాలమందు ఒకానొక వర్తకుడు ఉండేవాడు. అతడు అడవులలోకి పోయి, అక్కడ లభించే దినుసులు జేరం చేసి వర్తకం సాగించేవాడు.

ఒకసారి ఆ వర్తకుడు తన వ్యాపారంమీద ఒక మహా రణ్యంలో పోతూవుండటం తటస్థించింది. చాలాదూరం నడవడం చేత అలసట కలిగింది. అపరిమితమైన దాహంకూడా వేసింది.

వెతకగా వెతకగా, అల్లంత దూరాన ఒక కొలను కని పించింది. పోయి, దాహం తీర్చుకునేటంతలో అక్కడ ఒక శివ లింగం కనిపించింది. ఇదేమిటా చిత్రం చూదామని ఆ రాత్రికి అతడు అక్కడనే పడుకొన్నాడు.

తెల్లవారేసరికల్లా దేవతలు వచ్చి ఆ శివలింగం చుట్టూ చేరి, ఆరాధించటం కనిపించింది వర్తకుడికి. వర్తకుడు విస్మ యంతో వెంటనే తమ అధిపతి ఐన పాండ్యరాజువద్దకు పోయి, చూచినదంతా పూసగుచ్చినట్టు చెప్పాడు.

ఇది విని రాజూ ఆశ్చర్యపోయాడు. ఆయన తక్షణమే బయలుదేరి, వర్తకుడు చెప్పిన ఆ ప్రదేశానికి వెళ్ళాడు. అక్కడ ఒక పులి లేడిపిల్లకు పాలివ్వటం కళ్ళబడింది. రాజు ఆశ్చర్యానికి మేర లేకపోయింది.

'ఇది చాలా పవిత్రమైన ప్రదేశమై వుండాలి. లేకుంటే

పులి యేమిటీ, లేడిపిల్లకు పాలివ్వడమేమిటి ?' అని తలచి, ఆప్రదేశమందే తన నగరం నిర్మించుకోటానికి నిశ్చయించుకొన్నాడు రాజు.

అయితే—'ఈ పవిత్రప్రదేశం అనేది ఎంత మేర వున్నది ? నగరం స్థాపించటానికి సరిహద్దు లేవి ?' అని రాజుకు సంశయం కలిగింది. అప్పుడు పాండ్యరాజు పరమేశ్వరుని ప్రార్థించగా, ఒకచిత్రం జరిగింది.

పరమశివుడు ఒక సిద్ధుని రూపంలో రాజుకు ప్రత్యక్షమై, తన చేతిలో ఉండే పామును వదిలిపెట్టాడు. ఆ మహా సర్పం దాని తోకను ఒకచోట స్థిరంగా ఉంచింది. దేహం పెంచుకొంటూ, వంపులు తిరుగుకొంటూ, చుట్టేచుట్టే వచ్చి, తల మళ్లీ తోకదగ్గరకు వచ్చేటట్టు చేరుకొన్నది.

ఇలా పాము చుట్టివచ్చిన ప్రదేశంలోనే పాండ్యరాజు తన రాజధాని స్థాపించి, తగువిధంగా దానికి 'తిరు ఆలవై' అని నామకరణంచేశాడు. ఆ పట్టణం సకలవిధ సౌభాగ్యాలతోనూ తులతూగుతూ వుండింది.

ఐతే—ఇది చూచి సామంతరాజొకడు, సహించలేక పోయాడు. ఆ రాజు ఒక మాంత్రికుణ్ని పిలిపించి, పాండ్యరాజు నగరాన్ని నాశనం చేయటానికని నియమించాడు. ఆ మాంత్రికుడు ఒక మహానాగును మంత్రించి వదిలేసరికి, అది పాండ్య రాజు నగరంలో వుండే బావులలో, చెరువులలో, కాలువలలో హాలాహలం కక్కింది.

ఆ నీళ్ళు తాగి, పాపం ప్రజలంతా చచ్చిపోసాగారు.

అప్పుడు భీతిచెందిన జనులందరూ ఎలుగెత్తి జనార్దనుడికి మ్రొక్కుకోనేసరికీ, వారి మొర విని, భగవంతుడు అమృతాన్ని వర్షించాడు. అప్పుడు మహానాగు కక్కిన విషమంతా ఒక్క త్రుటిలో విరిగిపోయి, నీళ్ళన్నీ మళ్ళీ స్వచ్ఛములైనాయి.

అప్పటినించీ ఆ నగరం అపూర్వమైన శోభతో వెలుగ సాగింది. మధువు వర్షించటంవల్ల ఆ నగరానికి 'మధురై'— 'మధుర' అనగా మధురమైన నగరం—అని పేరు వచ్చింది.

సమస్తమైన చక్కదనాలతో విలసిల్లుతూ, ఈ నాటికీ 'మధుర'గా నిలిచివున్న మధురానగరపు మధురస్మృతులు ఇవి.

## పాములు : జాతీయాలు

—•—

పాముకు సంబంధించినంతవరకు మన సారస్వతంలోని జాతీయాలు, సంప్రదాయాలు, నమ్మకలూ, లోకోక్తులూ— తరచి చూదాం :—

నాగుమయ్య తన పుట్టనుండి బయల్దేరే ముందు—

'నరుడి కంట నేను పడకూడదు
నాకంట నరుడు పడకూడదు'

అని దేవుడికి మొక్కుకొని మరీ కదులుతుందట.

నాగుమయ్య ఈవిధంగా మొక్కుకొని బయల్దేరినప్పటికీ ఏ నరుడో దాని కంటబడక మానడు. ఈ సందర్భంలోనే 'పాపం చేసుకుంటే కాని పామునోట పడడు' అనే నమ్మిక ఏర్పడింది.

నరుడు పాము నోట్లో పడకుండా ముందుగానే మేల్కొంటే దాన్ని కొట్టడానికి సిద్ధపడతాడు. వాడు కొట్టడానికి సిద్ధపడే పాము తప్పించుకోవటం జరిగితే అది పగపట్టడం సంభవిస్తుంది. 'పాముపగ రాచపగ ఒకటి' అంటారు. కనుక మానవుడు పామువిషయంలో చాలా మెలకువతో మసలుకోవలసి వుంటుంది.

'పామును చంపిన పాపాత్ముడా !
తిరగవేశావు కావేమిరా ?'

—అని ప్రశ్నార్థకమైన చక్కటి జాతీయం ఒకటున్నది. తరచి చూడగా, ఇది నిగూఢమైన అంతరార్థం కలిగివున్నట్లు తోస్తున్నది. ఎలా అంటే—పామును చంపటం మహా పాపం. చేసిన పాపంలో కొంతయినా పోవటంకోసమే చంపిన పామును తిరగేసి పారవేయటం. ఇలా పారవేయటం ఎందుకూ ?—అని ప్రశ్న. పాము అడుగుభాగం తెల్లగా వుంటుంది. తెల్లటిరంగు గగనమార్గాన విహరించే గరుత్మంతుణ్ణి చప్పున ఆకర్షిస్తుంది. కనుక- చంపిన పామును తిరగేసి పారవేయటంవల్ల, అది గరుడుని ఆకర్షించి, దానికి ఆహార మవుతున్నది.

పోతే—తిరగేయకుండా పామును పారవేసినట్లయితే, పాము నల్లగా ఉండవచ్చు. గద్దను ఆకర్షించలేకపోవచ్చు. ఫలితం ? పాముశరీరం కుళ్లి కుసినారిపోవటమేకదా ! ఇదే ఇందులోని భావం.

పామును గద్దకు ఎరచేయటంలో కొంత పరమార్థమున్నట్టు ఇందువల్ల స్పష్టమవుతోంది. కొంతమంది మతజీవులు పామును చంపటం తప్పనిసరి అయినప్పట్లో, పాప పరిహారార్థం

కర్మకాండ జరిపించడం కద్దు. తెల్లనాగువంటి 'దేవతాజాతి' మహాసర్పాలను చంపినప్పుడు వాటికి ఊరేగింపు చేసి, చందన ఖండాలతో మహాభోగంగా, మంత్రసహితంగా దహన సంస్కారం జరపడం ఈనాడుకూడా అమలులో వుంటున్నది.

'రాత్రివేళ ఈలవేస్తే పాము లొస్తా'యని ఒక నమ్మిక.

కొంతమందికి ఎంత తిండితిన్నా పొట్ట పైకి ఉబకదు. అటువంటివాళ్లను చూచి 'వాడిది పాముపొట్టరా' అంటారు.

పాము నడక మెలికలు తిరుగుతూ, చూడ ముచ్చటగా వుంటుంది. అంతు లేకుండా తిప్పలు పెట్టేవాణ్ణి 'వాడు నన్ను పాముమెలికలు పెట్టేస్తున్నాడయ్యా' అని చెబుతారు.

ఒక విషయాన్నిగురించి ఒకేమనిషి రెండు విధాలుగా మాట్లాడినప్పుడు వాడిని 'రెండుతలల పాము'తో పోలుస్తారు.

'తాడికింద కూర్చుని మంచినీళ్లు తాగినా అది కల్లే అంటారు.' అలానే స్థలబలిమినిగురించి వివరించే ఒక పాము సామెతకూడా వున్నది: 'పుట్టమీద పురుగు కుట్టినా నాగుమయ్య మహిమే నంటారు.'

## పాములు : లోకోక్తులు

ఒకడిలో ఏమి సమర్థత వుందో తెలుసుకోగలగటమనేది చిన్నవిషయం కాదు. అందుకనే తెలియరాని సంగతులను గురించి విజ్ఞులు సైతం 'ఏ పుట్టలో ఏపాము వున్నదో!' అని, ప్రతిదానిలోనూ ఏదో గొప్పదనం వుంటుందనే నమ్ముతారు.

'పుట్ట' అనేసరికి మరొక జాతీయం జ్ఞాపకం వస్తుంది : జరిగి తీరవలసిన ఒక సంఘటనను వర్ణించవలసివస్తే 'పుట్టమీద పెట్టి నట్టు' అంటాం.

ఇలాటిదే తిరుగులేని విషయంగురించి మరొక పాము సామెత :

'ఉత్తర పురిమి కురిసినా
పాము తరిమి కరిచినా తిరగదు.'

సామాన్యంగా ఎక్కడగాని రెండు కక్ష లుంటాయి. ఏదో ఒక పక్షాన చెప్పవలసి వుంటుంది కద. అటువంటప్పుడు చిక్కువస్తుంది. ఈ సందిగ్ధ స్థితిని :

'కరువుమంటే కప్పకు కోపం
విడువుమంటే పాముకు కోపం'

అని చక్కగా వర్ణించారు.

దుర్మార్గుడు మేలుచేసినవాళ్ళకే కీడు తలపెడతాడు. అనగా రక్షించినవాడినే భక్షించడం ఇదే. దీన్నే పాముతో పోలుస్తూ, 'పాలుపోసిన చేతినే కాటువేస్తుం'దని చెబుతారు.

చురుకుతనం లేనివాణ్ణి 'ఏంరా, మన్నుతిన్న పాములా అలా వుంటావు ?' అని మందలిస్తారు.

ఎవరూ ఎటూ తప్పించుకోలేని ఆపదలో చిక్కుకొన్న సందర్భంలో :

'ముందువాడికి ముల్లుపోటు
వెనకవాడికి పాముకాటు'

అనే సామెత వాడుతాం.

# పాములు : సామెతలు

'పాము కుబుసం' తాకితే చంటిబిడ్డలు ఎండిపోతారని ఒక వాడుక. అయితే, బాలారిష్టాలలో గ్రహదోషాలకు పాము కూసం తెచ్చి పొగవేయటం కద్దు.

'పాము కుబుసం' అనేటప్పటికి వేదాంతపరమైన ఒక సంస్కృత లోకోక్తి స్ఫురణకు వస్తుంది :

అహి నిర్లయినీ న్యాయం : "పాము పొరతో ఉన్నంత కాలమూ ఆ కుబుసం తన దేహమే అని అనుకుంటుంది. పొర విడిచిపెట్టగానే అది తనది అనే (అ) జ్ఞానం దానికి ఉండదు." జ్ఞానంపొందిన మానవుడు తన దేహంమీది భ్రాంతిని విడిచిపెట్టినప్పట్లో ఈ పోలిక చెబుతారు.

కుబుసంతో ఉన్నంతకాలం పాము మైకం కమ్మినట్టుగా పడివుంటుంది. అది పొర విడువగానే చురుకుగా, ఉత్సాహంగా మసలుతుంది. ఇటువంటి ఉత్సాహాన్ని, చురుకుదనాన్ని తార్కాణగా చెప్పవలసి వచ్చినప్పుడు 'కూసం విడిచిన పాములాగ' అని వాడుతారు.

నాజూకుగా వుండే వస్తువులను 'పాముకూసం'లాగా వున్నవని పోల్చి చెబుతారు. పూర్వం, మనదేశపు 'డక్కన్ మజిలినులు' పాముకూసాల్లాగ ఉండేవట !

కోపముయొక్క వడిని వర్ణించే సందర్భంలో 'వాడు తోకతొక్కిన తాచులాగ లేచాడు' అని అంటారు.

'ఎర మింగిన పాము' తిన్నది జీర్ణం అయ్యేవరకూ కదల లేదు. ఉదాత్తంగా భోజనంచేసి కదలలేకుండా ఉన్నవాళ్ళని ఎర మింగిన పాముతో పోలుస్తారు.

'పాముతో చెలిమి—కత్తితో సామువంటి'దని పెద్దల వాక్యం. ఎందుచేతనంటే 'పాలు పోసి పెంచినా పాము కరవక మానదు.'

ఈ మాటనే దుర్జనులతో మైత్రినిగురించి ఒక తమిళ సామెత ఇలా వాక్రొంటున్నది:

'కడిక్కుర నాగమ్ కలందు ఉరవాగుమా ?'

అనగా 'కరిచే పాముతో స్నేహం ఏమిటి ?' అని భావం.

వేమన మహాయోగి ఈ విషయాన్నే మరికొంచెం విపులంగా ప్రబోధిస్తున్నాడు :

''సంపదలచు రాజు చను వగ్గలంబిచ్చు
చెఱుపనున్న వైరి చెలిమిసేయు
గఱవనున్న పాము నెఱగాచుకొనియుండు
విశ్వదాభిరామ వినుర వేమ॥''

అందులోనూ 'కాళ్లకు చుట్టుకొన్న పాము కరవక మానుతుందా ?' అనే సామెత దీనినే బలపరుస్తున్నది.

పాము ఇంత దుష్టమైనది కనుకనే 'చిన్న పామునైనా పెద్దకర్రతో కొట్టాలి' అని విజ్ఞుల హెచ్చరిక.

అయితే—

ఉన్నది ఉన్నట్టుగా పాము నంతటినీ మనం నిందించటానికి వీలులేదు. న్యాయానికి పాము మనకి చుట్టమే; హానిచేసే దాని పడిగమాత్రమే మనకు శత్రువు. దీన్నిబట్టే—

'పాము చుట్టము ; పడిగ పగ'
అనే 'స్తుతినింద' ఏర్పడింది.

## పాములు : పోలికలు

కొంతమంది తెలివిమంతులు ఏ విషయాన్ని గురించైనా అటూ యిటూ తెలకుండా మాటాడటం కద్దు. దీనినే 'పాము చావకుండా, కర్ర విరక్కుండా కొట్టడ'మని చెప్తారు.

పాముని కొట్టవలసివచ్చినప్పుడు ముందుగా దాని తల చితుకపొడుస్తారు. తల అస్వాధీనం కనుక అది తోకతోనే గిలగిల కొట్టుకుంటుంది. అప్పుడే తల ప్రాణం తోకకి వచ్చిందని నమ్ముతారు మనవాళ్ళు. దీన్నిబట్టే, ఏదయినా అతి ప్రయాసతో కూడిన ప్రయత్నం పూర్తి చేసినప్పట్లో 'తల ప్రాణం తోకకి వచ్చిందిరా, నాయనా' అనుకుంటారు.

జీవితంలో ప్రాతికూల్యాన్ని సూచించే సందర్భంలో 'కాని కాలానికి కర్రే పాము అవుతుంది' అని హెచ్చరిస్తారు పెద్దలు.

పాముకు గల బలమల్లా దాని కోరలే. అవి పోతే పాము వుండీ లేనట్టే. అలాగే మానవుడికి బలం అధికారం. అధికారం లేకుంటే మానవుడు తోటివారితో సమానుడే. అధికారంలో వున్న మానవుడు దానిని దుర్వినియోగం చేసిన పక్షమందు అతనికి ఉద్యోగం ఊడగానే 'కోరలు తీసిన పాము' అని అధిక్షేపిస్తారు లోకులు.

పాములో హాని చేసేదల్లా దాని పడిగ అని చెప్పాము. తేలుకు విషమంతా వుండేది కొండిలోనే. అందుచేత దుర్మార్గులలో పరమదుర్మార్గుణ్ణి వర్ణించవలసి వచ్చినప్పుడు :

'తేళ్ళలో కొండి ; పాములలో పడగ'

అనే జాతీయం వాడుతున్నాం. దీనిని పోలినదే మరొక సామెత వుంది.

'ఊడుములలో బుఱ్ఱ ; పాములలో తోక'

అని. ఇది రెండుపక్షాల వర్తించే గబ్బిలంవంటి కుయుక్తిపరుణ్ణి గురించినది.

లోభివాని యింటినిగూర్చి చెబుతూ, 'ఈగకు యిలి, పాముకు బలి పుట్టదు' అంటారు.

'పదిమందిలో పడ్డ పాము బతకటం అరుదు' అని ఒక నానుడి.

మసకచీకటిలో తాడును చూసి పాము అని భ్రమించి భయపడటం మనకు తరుచు స్వానుభవమే. దీనికే 'రజ్జు సర్ప భ్రాంతి' అని పేరు.

'తలమీద పాము వుంటుంది. సర్పవైద్యుడు దూర దేశంలో వుంటాడు'. అవసరానికి సహాయం దొరకని ఇలాటి స్థితిని—

'శీర్షే సర్పో దేశాంతరే వైద్యః'

అనే న్యాయం చెబుతోంది.

అల్పుడు ఉన్నతస్థానం పొందినప్పుడు గొప్పవారిని కూడ తనతో సమానులుగ ఎంచి మాట్లాడుతాడు. విష్ణు

వాహనమైనటువంటి గరుత్మంతుడు 'శేషాయా! క్షేమమా?' అని అడుగగా 'శివుడిదగ్గర వున్న మనకు ఏమి భయం' అనే గర్వంతో కన్నుగానని శేషువు 'గరుడాయా! క్షేమమా?' అని తిరుగుప్రశ్న వేశాడట. దీన్నే 'శేషాయ లెస్సా అంటే గరుడాయ లెస్సా అన్నట్టు' అంటారు.

ఆధిక్యతను వర్ణించే సందర్భంలో: 'ఆదిశేషుడికైనా అలవికా'దని చెప్పటం కద్దు.

## పాముచెవులు : పాముకాళ్లు

—•—

అతి సూక్ష్మంగా వినగలిగినవాడివి 'పాము చెవులు' అనటం మామూలు. అయితే పాముకు చెవులే లేవని ఈనాటి శాస్త్రజ్ఞులు ఋజువుచేస్తున్నారు.

పాముకు 'చెవులు' లేనట్టుగానే 'కాళ్ళు'కూడా లేవు. అందుకనే సర్పజాతికి 'సరీసృపములు' అనేపేరు వచ్చింది.

ఈ సందర్భంలోనే తెలుగుసామెత ఒకటి: 'పాముకాళ్లు పామునకెఱుక' దీనికే సంస్కృతంలో ఒక లోకోక్తి:

'భుజంగ ఏవ జానీతే భుజంగ చరణం సఖే'

—అనగా 'పాముకాళ్ళు పాముకే తెలుస్తాయి. ఆలాగే ఏజాతివారి గుట్టుమట్లు ఆ జాతివారికే తెలుస్తాయి.'

ఏదైనా ఎక్కువ చేదుగా వుండే మందులూ, కషాయాలూ సేవించవలసివచ్చినప్పుడు 'అబ్బ! కాలకూట విషం లాగా వుంది బాబూ!' అని ఏవగించుకుంటారు.

పరమేశ్వరుడు మెడలో ధరించేది పాము. ఈశ్వరుని కొడుకు సుబ్రహ్మణ్యుడు విహారించేది మయూరవాహనంమీద. ఈ రెండింటికీ ఎడతెగని వైరం. ఉత్సాహం కలిగినప్పుడు :

'పాము పడగెత్తి ఆడుతుంది ;
నెమిలి పురివిప్పి ఆడుతుంది.'

పాముకు శత్రువర్గంలో ముఖ్యంగా చెప్పవలసినది ముంగిస. నకులానికీ సర్పానికీ జన్మవిరోధం. ప్రబల వైరాన్ని చెప్పవలసినప్పుడు 'అహి నకుల న్యాయం' అనేది వర్తిస్తుంది.

## పాములు : పొడుపుకథ

—•—

'నూతిలోని పామూ - నున్నన్ని పామూ
పొడల పొడల పామూ - పొట్టి పొడుగు పామూ
వాడ వాడ పామూ - వాలైన పామూ
చార చారల పామూ - చక్కనైన పామూ
పామూ తెచ్చి - కూరా చేస్తే
పంటికిందికి చాలదు'

—ఇలా నడుస్తున్నది మన తెలుగుబిడ్డల పొడుపుకథ— పాముకూ పొట్లకాయకూ పోల్చి ఎంచక్కా వర్ణిస్తూ !

ఇది ఒక్క మన సారస్వతంలోనే కాదు. ఇంగ్లీషువారు కూడా మనపద్ధతినే అవలంబించారు. పొట్లకాయకు పాము పోలిక ఉండబట్టే **'Snake-Gourd'** అని పిలుస్తున్నారు.

అంతేకాదు. సంస్కృతంలో 'అహి' అంటే పాము. దీన్నిబట్టే పొట్లకాయకు 'అహిఫలా' అనేపేరు సార్థకమైంది.

ఇదేవిధంగా పోలికలనుబట్టీ, గుణాల్నిబట్టీ పేర్లు ఏర్పడే సందర్భాలను మరికొన్ని సూచిస్తాను :

నాగదొండ : ఇది ఒకతీగె. దీని ఆకులందు పాముసర్పం వంటి మచ్చలు ఉంటాయి. పామువిషం హరించటానికి దీని దుంపా, ఆకులూ వాడుతారు.

నాగమల్లి: దీనికే 'ఫణపుష్ప' అని సంస్కృతనామం. దీనిని బాగా పరిశీలించినట్టయితే పత్రాలు పానువట్టముగానూ, మధ్యనుండే బొడిపి లింగముగానూ, పైన కింజల్కసమూహం పాము పడగలు పట్టినట్టున్నూ ఏర్పడి సృష్టివై చిత్ర్యాన్ని ప్రదర్శిస్తూవుంటాయి. ఇవి ఈశ్వరపూజకు చాలా శ్రేష్ఠం. ఒకజాతి నాగమల్లి సర్పవిషం హరించటానికి ఉపకరిస్తుంది.

పెళ్లిలో నాల్గవనాడు జరిపే శుభకార్యాన్ని 'నాగవల్లి' (నాకబలి) అంటారు. నాగవల్లి నడిపే ముత్తయిదువ నాగపసాని—నాపసాని.

'పాములవాడు ఊదేది నాగస్వరం
వరుణుని ఆయుధం నాగపాశం'

'నాగాస్త్రం' అనేది దేవతలు ఉపయోగించే ఒక అస్త్రం.

నాగపడగలు, నాగరము, నాగవత్తులు—అనేవి సర్పాకృతి గల ఆభరణ విశేషాలు.

తమలపాకుకీ, సర్పజాతికీ ఒక చిత్రమైన సంబంధం వుంది. ఆదిలో అసలు 'తమలపాకు' అనేది భూలోకంలో లేదు. పాండవులు అశ్వమేధయాగం చేసినప్పుడు వారికి తమలపాకులు కావలసివచ్చి వాసుకీవద్దకు కబురుపంపారు. సర్పరాణి తన చిటి

కెనవేలు కోసి దూతలకు ఇచ్చిందట. ఇది భూలోకమందు పాతి పెట్టినంతనే ఒక తీగె మొలకెత్తింది. ఇదే 'తమలపాకు' తీగె. దీనికే 'నాగవల్లి' అని పేరు.

గ్రహణం రోజుల్లో సూర్యుణ్ని గాని, చంద్రుణ్ని గాని 'పాము మింగుతుం'దని వాడుక. దీనికీ సముద్రమథన గాథకూ సంబంధం వుంది.

## పాములు : కొన్ని నమ్మకలు

పాశ్చాత్యుల నమ్మకలు కొన్ని :

వారు 'సైతాను' (Saturn) ను ఒక 'పెద్దపాము'గా చిత్రించుకొన్నారు. 'పాము' రూపంలోనే వచ్చి సైతాను, 'అవ్వ'ను భ్రమపెట్టినట్లు బైబిలు చెబుతోంది.

వారి 'ఆరోగ్యదేవత' చేతిలో ధరించే చిహ్నం పాము.

పాము బుద్ధిబలానికి చిహ్నం.

పామువిషం పాముకే కీడుచేస్తుందట. అందుచేతనే అది నీళ్ళు తాగేముందు విషమంతా కక్కివేసి తరవాతనే దాహం తీర్చుకుంటుందని పాశ్చాత్యులు నమ్ముతారు.

'పాము దైవత్వానికి చిహ్నం. ఎలా అంటే : దైవం సృష్టికార్యం జరిపించి తన లీలకోసం ఎలా అయితే దాన్ని లయంచేస్తున్నాడో, అలానే పాము తన శరీరంనుండి ఉద్భవించినవాటిని (గుడ్లను) తనే మింగివేసి తనలో ఐక్యం చేసుకొంటున్నది'—ఇది ప్లూటార్క్ మహాశయుని వాక్యం.

# పాముల పుట్ట

భాగవతం ఒక 'పాముల పుట్ట'. అసలీ మహాగ్రంథం ప్రారంభం కావటమే ఒక పాముగాథతో:

శమీకమహాముని గాఢతపస్సులో మునిగివున్నాడు. పరీక్షిన్మహారాజు ఆ ప్రాంతానికి వేటకువచ్చి డస్సి దాహంతో వున్నాడు. ముని లేచి రాజుఅయిన తనను సత్కరించలేదనే కినుకతో ఒక చచ్చినపామును తెచ్చి మునిమెడలో వేలాడదీశాడు. రాజు మరలిపోయిన" మరి కొంతసేపటికి మహర్షి పుత్రుడైన శృంగి ఈ వృత్తాంతం తెలిసి రోషపూరితుడై కౌశికీనదికి పోయి జలోపస్పర్శనము చేసి :

"ఓడక వింటికోపున మృతోరగముం గొనివచ్చి మాఱు మా
టాడకయున్న మజ్జనకు నంసతలంబునఁ బెట్టి దుర్మద
క్రీడఁ జరించు రాజు హరకేశవు లాఁగినఁ జచ్చు నేటితో
నేడవనాఁడు తక్షక ఫణీంద్ర విషానలహేతి సంహతిన్"

అని శపించాడు.

కొడుకు చేసిన తొందరపాటుపనికి మహాముని మందలించాడు. శాపమునకు తిరుగులేదని తెలుసుకొని పరీక్షితునికి మునిబాలకులపరంగా తెలియజేశాడు. పరీక్షిత్తు ఇది తెలిసికొని ఈ విధంగా చింతించాడు :

"ఏటికి వేఁటపోయితి మునీంద్రుఁడు గాఢసమాధి నుండగా
నేటికిఁ దద్భుజాగ్రమున నేసితి సర్పశవంబుఁ దెచ్చినే

నేటికిఁ బాపసాహసము లీక్రియఁ జేసితి దైవయోగమున్
దాఁటగరాదు వేగిరమ తథ్యము గీడు జనించు ఘోరమై—

పాము విషాగ్నికీలములఁ బ్రాణము లీఁగిన నీఁగుగాక యీ
భూమియు రాజ్యభోగములు వోయిన నిప్పుడ పోవుగాక సౌ
దామినిఁ బోలు జీవనముఁ దథ్యముగాఁ దలపోసి యింక నే
నేమి [illegible]యుదిట్టుదు మునీంద్ర కుమారకు దుర్నివారకున్—

రాజననుచుఁ బోయి రాజ్యగర్వంబున,
వనముకొఱకు వారి వనము సొచ్చి
దందశూకశవముఁ దండ్రిపై వైచినఁ,
మెలియఁ దిట్టకేల పోవు సుతుఁడు—'

మునికుమారుడు శపించిన వృత్తాంతం విని తక్షకుడు అనే పాములపెద్ద తన విధినిర్వహణకోసం వేచిఉన్నాడు. ప్రాజ్ఞుడైన పరీక్షిత్తు 'తక్షకవ్యాళ విషానల జ్వాలాజాలంబున' తన కేడవ రోజున మరణము నిశ్చయమని తెలిసి, భూలోక స్వర్గలోక భోగములు హేయములని తలచి, రాజ్యము విసర్జించి, నిరసనదీక్షాచరణము సంకల్పించుకొన్నాడు.

పవిత్ర గంగానదీమధ్యన 'ఒంటిస్తంభపు మేడ' కట్టించుకొని, తగిన కట్టుదిట్టాలన్నీ ఏర్పరుచుకొని అందులో ప్రవేశించాడు. పరీక్షితుని ప్రాయోపవేశవార్త తెలియగానే మహర్షులందరూ వచ్చారు. వారందరనూ పూజించి, తన మహాపాపం తొలగే మార్గం చెప్పవలసిందని ప్రాధేయపడ్డాడు రాజు. అప్పుడు శుకమహర్షి వచ్చి ఏడురోజులలో భాగవతకథ వినిపించి రాజుకు ముక్తి చేకూర్చాడు.

# సముద్రమథన కథ

భాగవతంలో రెండవ పాములపెద్ద వాసుకి. దూర్వాసుని శాపంవల్ల దేవలోకానికి చెందిన సంపద యావత్తూ నశించి పోయింది. మళ్లీ ఆ సంపదను తెచ్చుకోటానికి దేవతలు, దానవులతో కలిసి క్షీరసాగరం మథించవలసి వచ్చింది. ఈ మథనం కోసం మందరపర్వతం కవ్వంగానూ, వాసుకి కవ్వపుతాడు గానూ నిశ్చయమైంది. అప్పుడు :

'......భోగీంద్రువాసుకిఁ బిలిపించి యతనికిఁ బ్రియము సెప్పి
ఫలభాగ మీ నొడఁబడి సమ్మతునిఁ జేసి మెల్లన చేతుల మేను నివిరి
నీవకాకెవ్వరు నేర్తురీ పని కియ్యకొమ్మని యతని కైకోలు వడసి
కవ్వంపుఁగొండ నిష్కంటకంబుగఁ జేసి ఘర్షించి
యతని భోగంబుఁ జుట్టి
కడఁగి యమృతజలధిఁ గలశంబుఁ గావించి
త్రచ్చు వవసరమునఁ దలఁపు లమర
బద్ధవస్త్రకేశభారులై యారెండు
గములవారు తరువఁ గదిసి రచట.'

ఈ సందర్భంలో వాసుకి తలవైపు పట్టుకోవాలని దేవతలు ప్రయత్నించగా పౌరుషవంతులైన దానవులు :

'స్వచ్ఛమైన ఫణంబు మీరలు సక్కఁబట్టి మథింపగాఁ
బుచ్ఛమేటికి మాకు బట్టఁగఁ బూరుషత్వము గల్గి మే
మచ్ఛమైన తపోబలాఢ్య యనాన్వయంబుల వారమై
యిచ్చ యుంతుమె తుచ్ఛవృత్తికి నిండు మాకు ఫణాగ్రముల్'

—అని వాదించి తమ పట్టు నెగ్గించుకొన్నారు.

ఈ సముద్రమథన ఫలితంగా :

'అలోల జలధిలోపల
నాలో నహి విడిచి సురలు నసురలుఁ బఱవం
గీలాకోలాహల మై
హాలాహల విషము పుట్టె...'

ఇటువంటి హాలాహలాన్ని మింగి లోకాలను రక్షించగల సామర్థ్యం ఒక్క శివునికే ఉండింది. ఈ గరళాన్ని తన కంఠ బిలమునందు ధరించినందువల్లనే శివుడికి 'గరళకంఠుడు' అనే పేరు వచ్చింది. సుప్రసిద్ధమైన ఈ—

'హాలాహల భక్షణ కథ
హేలాగతి విన్న వ్రాయ నెలమిఁ బఠింపన్
వ్యాళానల వృశ్చికముల
పాలై చెడరెట్టి జనులు భయవిరహితులై'

అని దీని ఫలశ్రుతి చెప్పబడుతున్నది.

## కాళింగుడు : కృష్ణపాదాలు

తరువాత మనకు తారసపడే పాముల పెద్ద కాళీయుడు. కాళింగుడు శాపవశంచేత వ్రేపల్లెమడుగులో తలదాచుకొంటు న్నాడు. అతని ఉనికివలన లోకానికి బాధ మిక్కుటమయింది. అప్పుడు బాలకృష్ణుడు :

'మడుగుకు జని కాళీయుని
పడగలపై భరతశాస్త్రపద్ధతి వెలయన్

కడు వేడుకతో నాడెను'—అని కృష్ణశతకకర్త వర్ణిస్తున్నాడు.

కాళీయుడు నొచ్చి చచ్చినట్టు పడిపోయాడు. అంతలో అతని భార్యలైన నాగాంగనలు వెలికివచ్చి :

'ఎట్టి తపంబు సేసెనొకొ యెట్టి సుకర్మము లాచరించెనో
యెట్టి నిజంబు వల్కెనొకొ యీఫణి పూర్వభవంబునందు ము
న్నెట్టి మహానుభావులకు నెన్నఁడుఁ జేరువగాని నీవు నేఁ
డిట్టి వినోదలీలఁ దలలెక్కి నటించెద వీ ఫణీంద్రుపై'

—అని ఈవిధంగా శ్రీకృష్ణపరమాత్ముని స్తుతించి తరించారు.

శ్రీకృష్ణుడు కాళింగుని పడగపైన దుముకుటతో దేవ దేవుని చిట్టిపాదాలు పడగపైన ముద్ర పడిపోయినై. ఈనాడు కూడా నాగుపాము తలపైన మనకు 'కృష్ణపాదాలు' స్పష్టంగా కనిపిస్తాయి.

* * *

ఇటువంటి మహత్తరమైన భాగవతాన్ని విని తరించిన పరీక్షితు కుమారుడు జనమేజయుడు. జనమేజయుడు తన హయాములో 'సర్పయాగం' చేయగా, తక్షకుడు పోయి ఇంద్రుని సింహాసనాన్ని చుట్టబెట్టుకొన్నాడు.

అంతలో 'సహేంద్రతక్షకా యానుబ్రూహి' అనే వాక్యం వినబడింది. అప్పుడు ఇంద్రుడుకూడా స్థానభ్రంశం పొందనుండగా అంగీరసుడు అడ్డుపడి, జనమేజయుడికి హిత బోధ చేసి, సర్పయాగం నిలుపు చేయించాడు.

## పాములు : ఉపాఖ్యానాలు

నలమహారాజు అరణ్యాలపాలై పోయినప్పుడు దారిలో కార్చిచ్చులో పడబోతున్న ఒక పాము రక్షించుమని ప్రార్థిం

చింది. లెక్క పది అడుగుల దూరం అవతలకు తీసుకపొమ్మని ప్రాధేయపడింది.

ఆ ప్రకారం నలుడు అడుగులు లెక్కించుకుంటూ దానిని తీసుకపోయాడు. తొమ్మిదిఅడుగులు వేశాక 'దశ' అని లెక్కించాడు. 'దశ' అనగా 'కరువు'మనికూడా అర్థం. ఈ కారణంచేత పాము 'దశ' అనగానే నలుణ్ని టక్కున కాటువేసింది.

తక్షణమే నలసార్వభౌముడు నల్లగా మారి, వికృత రూపం దాల్చాడు. ఈ పామే 'కర్కోటకు'డనే పెద్ద. కర్కోటకుడు ఇలా కరవటమల్లా నలుడుకి మంచిగానే పరిణమించింది.

శాపవిముక్తిమార్గంకూడా కర్కోటకుడే నలునికి చెప్పి పోయాడు. తదుపరి—ఋతుపర్ణుని కొలువులో నలుడు వంటలవాడుగా ఉన్నంతకాలమూ ఎవ్వరూ అతనిని గుర్తించ లేకపోయారు.

ఇవి పాముజాతిలో కొందరు పెద్దల గాథలు.

'నలోపాఖ్యానం' ఒకటే కాదు. 'అజగరోపాఖ్యానం' అనే ప్రసిద్ధమైన ఇతిహాసం మరొకటున్నది. గర్వమదాంధుడైన నహుషుడు అగస్త్యముని శాపంవల్ల పామురూపం పొందాడు. మార్గవశాత్తు భీముడు ఆ పాముకు పట్టుబడ్డాడు. తప్పించుకోలేక పోయాడు. ధర్మరాజును కొన్ని ప్రశ్నలు వేస్తాడు నహుషుడు. అతడు ఇచ్చిన సమాధానాలకు తృప్తిపడతాడు. అంతటితో

భీమసేనుడు విడువడటం, నహుషునికి శాపవిముక్తి కలగటం ఒకేసారి జరుగుతాయి.

## పాములు : కవిత్వం

సుబ్రహ్మణ్యస్వామి వాహనం నెమిలి అనీ, ఈశ్వరుడు ధరించేది పాము అనీ ఇదివరకు చెప్పివున్నాము. ఐతే, ఈ రెండింటికీ ఎడతెగని వైరమనికూడా చెప్పాము. ఈ నెమిలి చేసే నృత్యాలూ, ఆ పాము నడిచే నడకలూ పద్యాలలోకూడా మనకు ప్రస్ఫుటమవుతున్నాయి. చూడండి: 'వనమయూరము' అనే వృత్తంలోని అందాలు చిందేటి నృత్యం—

"నీల గళ నీరనిధి నిశ్చల నిషంగా
బాల శశిమౌళి కరభావిత కురంగా
శూలధర కుండలిత సుందర భుజంగా
హాలాహల భోజన వృషాధిపతురంగా."

అటు పిమ్మట—పరమసుందరమైన పామునడకలను మనకు చవిచూపించే వృత్తం 'భుజంగప్రయాతము' అనేది—

"సమసావనీనాథ సంస్తూయ మానా
హిమక్షీర భాకీర్తి హేలా నిదానా
విమాలిన్య విజ్ఞాన విద్యావిధానా
ప్రమాదాది హీన ప్రభావ ప్రధానా."

మహత్తరమైనటువంటి 'పాము' పూర్వకవులకే కాదు. ఆధునిక కవులకుకూడా ఆవేశం కలిగించి కథావస్తువగుతున్నది:

విశ్వనాథవారు 'వేయిపడగలు' అనే ప్రతిభావంతమైన ఆఖ్యాయికను రచించటంలో వేడుక చూపారు.

శబ్దజాలంతో సాముగరిడీలు చేసే యువకవి, నవకవి, ప్రజాకవీ మన శ్రీ. శ్రీ. రచనలనుండి పాము సంబంధమైన కొన్ని మచ్చుతునకలు—

'పతితులార ! భ్రష్టులార !
బాధా సర్పదష్టులార !'

—జగన్నాథుని రథచక్రాలు

'సుప్తకంకాళాలు మేలుకుంటున్నాయి !
ప్రపంచం పడగెత్తి బుసకొట్టి లేచింది'

—గర్జించు రష్యా

'ఇరవై కోరల, అరవై కొమ్ముల,
క్రూర ఘోర కర్కోటకులో ?
కోరకి కన్నూ, కొమ్ముకి కన్నూ,
కర్కాటక కర్కోటకులో !'

—కేక

'త్రాచులవలెనూ, రేచులవలెనూ,
ధనంజయునిలా సాగండి !'

—మహాప్రస్థానం

'ఎగిరించకు లోహవిహంగాలను !
కదిలించకు సుప్తభుజంగాలను !
ఉండనీ,
మస్తిష్కకులాయంలో !
మనోవల్మీకంలో !'

—సాహసి

# పాములు : చాటువులు

ఇంతవరకూ పలు శీర్షికలకింద పాము ప్రసక్తి నడిచింది. మనసుకు ఆహ్లాదం చేకూర్చటంకోసమని కొద్దిపాటి వినోద ఘట్టాలను వివరించే చాటువులు కొన్ని :

ఆస్థానాలలో ఆశ్రితులను చేరనివ్వని దుష్టులనుగురించి మల్లికార్జునశతకకర్త మండిపడుతూ చెప్పిన పద్యాన్ని మొదటనే ఉటంకించాము. అదే భావాన్ని హాస్యధోరణిలో వెల్లడించిన మరిఒక ఘట్టం!

కోమటి వేమారెడ్డి ఆస్థానమందు మామిడి సింగన్న మొదలైనవారు మంత్రులుగా ఉండేవారు. అందులో తురగా రామన్న అనే మంత్రి దుష్టుడట. ఒక కవి ఆ రామన్నమంత్రిని గురించి ఇలా పద్యం కట్టాడు :—

కోమటి వేమన త్యాగము
భూమిఁ బ్రసిద్ధంబు కల్పభూజముచేతన్
బాము న్నపగిదిఁ దురగా
రాముం డున్నాఁడు చేరరా దెవ్వరికిన్ ॥

* * * *

తన విద్యకూ, సామర్థ్యానికీ తగినట్టి బహుమతి ఇవ్వ లేదని ప్రభువులమీద కోపించి, భాస్కరసూతి కొండమంత్రి ఈ పద్యం చెప్పాడు :—

పద్యము చెప్పిన నొకనికి
హృద్యముగా నియ్యనట్టి హీనాత్ముని యా
పద్యము పామై కఱచును
ప్రద్యోతిత కీర్తికాంద ! భాస్కరుకొండా !

*　　*　　*　　*

వదాన్యచరితుడైన రాయనిభాస్కరుని నిర్యాణానంతరం కొన్ని దుష్టగ్రహాలు ఆస్థానంలో చేరి, ఆ ప్రభువు పేరు మాసిపోయేటట్లు చరించారు. ఆ చేరినవారందరూ ఎటు వంటి విశేషాలు కలవారూ ? అంటే - ఒక మహాకవిచేత ఇలా వర్ణింపబడ్డారు :—

సహజ కళంకమూర్తులు కుజాతులు గూఢతరోదయ ప్రభా
మహితులు గోత్ర విద్విషదమాత్యులు రాత్రిచరానుకూల ధీ
సహితులు మందవర్తనులు 'సర్ప సమానులు' రాజసేవక
గ్రహములు కాననయ్యె నల రాయనిభాస్కరుఁ డస్తమించినన్॥

*　　*　　*　　*

శ్రీనాథుడు ఒకప్పుడు గురిజాలసీమలో 'పులిపాడు' అనే గ్రామానికి వెళ్ళడం తటస్థించింది. ఆ గ్రామానికి శేషయ్యా కరణం, హనుమయ్యా కాపు, పుల్లయ్యా అనేఆయన రెడ్డి. ముగ్గురూ శ్రీనాథకవిని ఆదరించలేదు. వాళ్ళ వాలకం చూచి వెంటనే శ్రీనాథుడు పద్యం చెప్పాడు, ముగ్గురినీ కలిపి—

ఊరు వ్యాఘ్రనగర, మురగంబు కరణంబు,
కాఁపు కపివరుండు, కనవునేఁడు
గుంపు గాఁగ నిచట గురిజాలసీమలో
సొగులెల్లఁ గూడి రొక్కచోట !

# పాములు : సంగీతం

మన గానశాస్త్రంలో వుండే రాగాలలో 'పున్నాగ వరాళి' రాగం పాములకు ఎంతో ప్రియమయింది. 'మయూర ధ్వని' అనే రాగం పాడినప్పుడు పాములు పారిపోతవని ప్రతీతి. ఈ విషయంకూడా పాముకూ నెమలికీ మధ్యని గల వైరుధ్యాన్ని రూఢిపరుస్తున్నది.

# పాములు : స్థలమహిమలు

మన కథాసారస్వతంలో 'నాగకన్య' లు చాలా ప్రసిద్ధి. ఎంతమందికో నాగకన్యలు ఉపకృతులు చేసిన ఉదంతాలు ఉన్నాయి. వారు మానవులను పెళ్లి చేసుకున్న కథలుకూడా ఉన్నాయి. ఇందు పురాణప్రసిద్ధమైనది 'ఉలూపి' వృత్తాంతం.

'ఆంధ్రులు నాగజాతివారు' అని ప్రసిద్ధి. అందుకనే మన జాతి చిహ్నంలో రెండు నాగులు కనబడతాయి.

దుర్యోధనుని రథధ్వజముపైన ఉండే చిహ్నం సర్పము.

'శ్రీకాళహస్తి' స్థలపురాణం అందరకూ తెలిసినదే.

'పాము' పేరుకు సంబంధించిన స్థలాల్లో పేర్కొనదగింది తిరువాన్కూరు సంస్థానంలోని 'నాగర్కోయిల్'. ఇది సర్ప పూజకు గొప్ప కేంద్రం.

ఇక్కడ సర్పమాత 'నాగమ్మ' విగ్రహం వున్నది. తాంబ్రపు పడగను ఏటేటా ఊరేగింపు చేస్తారు. విగ్రహం వెనకనించి

సంవత్సరంలో ఆరునెలలపాటు నల్లరయిసుక, తక్కిన ఆరునెలలూ తెల్లయిసుక పైకి వస్తుంది. దీనినే భక్తులు ప్రసాదంగా స్వీకరిస్తారు. గుడిలోపల రాతివిగ్రహాలు అనేకంగా వున్నాయి. ఆదివారం రోజున పుట్టలో పాములకు ఆ ప్రాంతీయులు పాలు, చక్కెర, కొబ్బెర నివేదన చేస్తూవుంటారు. ఆలయం ఆవరణ నుండి ఒకమైలు చుట్టూతా పాముకాటువల్ల ఎవ్వరూ మరణించరని ప్రతీతి.

'పామిడి' - భోగేశ్వరస్వామికి నిలయం. (పాము + ఎడ) పాము ఉండేస్థలం—అందుచేతనే దీనికి 'పామిడి' పేరు వచ్చింది.

పంచ ఆరామాల్లో 'సర్పారామం' ఒకటి. ఇదే కాకినాడకు సమీపంలో ఉన్న సర్పవరం.

పూర్వం ఒకప్పుడు రాక్షసుల పోరు పడలేక సర్పములన్నీ పోయి ఆదిశేషునితో మొరపెట్టుకున్నాయి. అప్పుడు శేషుడు ఒక గుండము తవ్వి యజ్ఞంచేసి రాక్షసుల బాధనుండి తప్పించాడు. అదే 'శేషగుండం' అనే పేర భద్రాచలంలో ఇప్పటికీ వెలసివున్నది. దాని చుట్టుపట్టుల నీరు వేడిగా ఉండటం చేత 'ఉష్ణగుండం' అని మరిఒక పేరు కూడా వున్నది.

## ప్రపంచమంతటా పాముల పూజలే!

### వింతవింత విశ్వాసాలు : చిత్రమైన చేష్టితాలు

—♦—

నాగులని పిలువబడే పాముదేముళ్ళకు, మన దేశంలో పూర్వం, నరబలికూడా ఇవ్వడం ఒక ఆచారమై వుండేది.

శ్రావణమాసంలో వచ్చే నాగపంచమి గొప్ప పర్వం. ఆనాడు సర్పాధిదేవత ఐన 'మానసాదేవి'ని ఎన్నో హిందూ కుటుంబాలు అత్యంత భక్తితో ఆరాధించడం కద్దు.

ఆనాడు క్రూరమైన బలులిచ్చి దేవతను సంతోషపెట్టజూచేవారు. తెలుగుమీరినకొద్దీ, నాగరకత ప్రబలిన ప్రదేశాలలో ఇప్పుడిప్పుడు ఈ క్రూరాచారాలు తగ్గుతూ వస్తున్నాయి. ఐనా అస్సాం ప్రాంతంలోని కొండజాతులలో ఈ అలవాట్లు ఎప్పటిలా ముమ్మరంగానే వుంటున్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు.

## వంగదేశంలో

వంగదేశస్థుల నమ్మిక ప్రకారం, మానసాదేవి అతి శాంతస్వరూపిణి. ఉగ్రమూర్తి కాదు. దేవికి చతుర్భుజాలు, నాలుగు హస్తాలలోనూ నాలుగు నాగులు. చుట్టలుగా చుట్టుకొనివుండే పాములమీదనే పాదాలు మోపి కూర్చుంటుంది. ఇటువంటి ఆకృతి గల విగ్రహాలను వారు సృష్టించుకొంటారు. పూజలు పూర్తిఅయి, 'ఉద్వాసన' చెప్పిన తరువాత అత్యంత వైభవమైన ఉత్సవాలతోనూ, ఊరేగింపులతోనూ తీసుకపోయి, చెరువులోనో కోనేటిలోనో కలుపుతారు.

## పడవల సంబరం

కొన్ని ప్రాంతాలలో ఒక చిత్రమైన ఆచారమున్నది. ప్రత్యేకించి ఈ పర్వంకోసమని వందలకొద్ది తెప్పలు తయారు చేస్తారు. వాటిని ఆ రోజున ఆకర్షణీయంగా అలంకరిస్తారు. ఈ సందర్భంలో తీవ్రమైన పోటీలు జరగటమే గొప్ప సంబరం.

తూర్పుబెంగాలులో 'మానసాబరి' అనే ఒక గ్రామమున్నది. మానసాదేవి ఉనికి ఇదేనని ఆ దేశస్థుల నమ్మకం.

## ఎరుకలమ్మ మహిమ

ఈ మానసాదేవిని ఉపాసించే భక్తురాలు ఒకామె ఆ ప్రాంతంలో ఎక్కడో వుంటుంది. ఆమె ఎరుక చెబుతుంది. ధూప దీపాల అట్టహాసంతో, ఆవలింతలు ఆవులిస్తూ, ఆమె ముక్కాలిపీటపైన ఆసీనురాలై వుంటుంది. దేవి ఆమెకు పూనిన వెంటనే శివాలాడుతూ జ్యోతిషం చెప్ప నారంభిస్తుంది.

వచ్చినవా రెవరో, పని యేమిటో ఏ వైనమూ ఆమెకు చెప్పనక్కరలేదు. అలా చూస్తూ కనిపెట్టుకొని ఉండగా వుండగా, ఆమె నోటివెంట పలుకులు వాటంత టవే వెలువడు తాయి. ఆ పలుకులలో అక్కడ హాజరై వున్నవాళ్ల ప్రసక్తి వస్తుంది. ఏదైనా ఆపదలో వుండి చిక్కు ఎలా తీరుతుంది అని ఒకవేళ వాళ్ళు అడగటానికి వచ్చినట్లాయెనా, ఆ తీరగల వుపాయంకూడా ఎరుకలమ్మపరంగా వచ్చే దేవి పలుకులలోనే తెలుస్తుంది.

దేవి పూనకం కలిగినప్పుడు మాత్రమే ఎరుకలమ్మ ఇలాటి మహిమ కలిగివుండటం. ఉత్తప్పుడు ఆమే మనలాటి మామూలు మనిషే.

ఐతే, ఆమె పాములవాళ్ళజాతికి చెందినదై ఉండటం వల్ల, పిలిస్తే సరి, ఏడు ఇరుకులలో వున్న పాములుకూడా వచ్చి ఎదుట నిలబడతాయి! వంశపరంపరాగతమైన ఈ జాతికి 'బేడియా'లని పేరు. పాములకు సంబంధించిన మంత్రాలూ

మహిమలూ వీరి సొమ్ము. మంత్రంవల్ల పామును కట్టేసి వశ పరుచుకోవడమే కాదు, పాముకాటుకు ఉపకరించే అమోఘమైన ఓషధులూ, ప్రక్రియలూ కరతలామలకములై వుంటాయి.

## పామూ—పక్షీ పోరు

నాగపంచమినాడు పురోహితులు వారివారి ఖాతాదారు లందరి ఇళ్ళకూ వెళతారు. ఆనాడు ప్రతి ఇంటి తలుపుల మీదా, సర్పరాజయిన అనంతుడి బొమ్మలు అంటించి అలంకారం చేసుకొంటారు. ఈ బొమ్మలలో సాగరంలోపలినుండి అనంతుడు పడగలు ఎత్తి, పడగలపైన భూమండలాన్ని మోస్తున్నట్టుగా చిత్రించబడివుంటుంది.

వంగదేశంలో వాడుకగా ఉంటున్న గాధను బట్టి— విష్ణువు వాహనమైన గరుత్మంతుడికీ, సర్పరాజయినటువంటి తక్షకుడికీ మధ్యని ఒకప్పుడు ఘోరయుద్ధం జరిగింది. తక్షకుడికే జయం కలిగింది. తదుపరి ఉభయులకూ రాజీ కుదిరింది. తన విగ్రహం గల చిహ్నం గరుత్మంతుడు సదా మెడలో ధరించాలని షరతు పెట్టాడు తక్షకుడు.

ఈనాడుకూడా నేపాళదేశపు అనేకమైన గుళ్ళలో, సర్పరాజుకు గరుడుడు మోకరిల్లి కూర్చున్న విగ్రహాలు చూస్తే ఈ ఇతిహాసం రూఢిపడుతున్నది.

## కలశలో తీర్థం

ముఖ్యంగా 'చంగునారాయణ' ఆలయంలో పూజారులు నాగపంచమిరోజున ఒక బ్రహ్మాండమైన కలశలో వుండే పవిత్రమైన ఉదకాన్ని రుమాలుతో పిండి భక్తులకు తీర్థంగా

VERSITY OF HYDERABAD

ఇస్తారు. ఈ తీర్థం నిగూఢమైన అంతరార్థంతో కూడుకొని వున్నది. అలనాడు సర్పరాజు గరుత్మంతుడితో ఘోరయుద్ధంచేసి నప్పుడు అలసటచే రాలిన స్వేదబిందువులే ఈ తీర్థమని నేపాళ దేశస్థుల నమ్మకం. ఈ తీర్థాన్నే పూజారులు పాముకాటుకు చికిత్సగా ప్రసాదిస్తారు.

## ఐంద్రజాలికుని దుర్మార్గం

నేపాళదేశంలో ఒక గొప్ప లోయ వున్నది. అక్కడి ఐశ్వర్యాలను కాపాడేది పాముదేముళ్లేననీ వారు ఇప్పటికీ నమ్ముతున్నారు. ఈలోయ పూర్వకాలమందు ఒక ఘనమైన సరస్సట! ఇందులో నాగులు నివసించడంచేత దానికి 'నాగవాస' మని పేరుండేదిట.

మహాచైనా (మంచూరియా) నుండి వచ్చిన 'మంజు శ్రీబుద్ధ' అనే ఐంద్రజాలికుడు తన ఖడ్గంతో కొండలూ గుట్టలూ కొట్టితెచ్చి, ఆ సరస్సులో పడవేయగా, అది పూడిపోయి ఇంకి పోయిందని ఒక జానపదగాథ.

ఈవిధంగా, సర్పాలు నివసించే ఆ సరస్సు మానవులకు వాసయోగ్య మయిందట. ఐతే—స్థానభ్రష్టుత్వం పొందిన ఆ సర్పాలు సరాసరి పాతాళలోకం చేరుకొని, ఇప్పుడింకా అక్కడనే ఉంటున్నాయని అంటారు నేపాళదేశస్థులు. పైగా, తమను తరిమివేసినందుకు కోపంతో అప్పటప్పట వాటి పడగలు విప్పి, పరుగులెడుతుంటవనీ, ఈ కదలికవల్లనే భూకంపం కలుగుతుందనీ వారి విశ్వాసం.

## తాంత్రికుల తమాషా

నేపాళీయుల నమ్మిక అంతటితోనూ ఆగలేదు. ఆ పగబట్టిన పాముల కోపంవల్లా శాపంవల్లనే దేశంలో కరువు కాటకాలు పట్టుతున్నవని వారి ఉద్దేశం. అందుచేత, క్షామంపట్టిన సమయాలలో వారు ప్రసిద్ధులైన మాంత్రికులను ఆశ్రయిస్తారు.

ఈ మాంత్రికులకు 'గుభాజులు', 'జౌరులు' అని పేరు. నిజానికి వీరు చేసేది తంత్రమేకాని, మంత్రం వేయడం కాదని పిస్తుంది. ఏమంటే—'ఇదుగో చూచుకోండి. పాతాళపురానికి పోయి వస్తా!' అని భీకరంగా అంటూ, బుసకొట్టుతున్న పాము లుండే కొలనులోనికిగాని ఏదైనా రహస్యమార్గంలోకిగాని చొరబడి అదృశ్యమవుతారు.

నిజంగా పోయివచ్చామని రుజువుచేసి ప్రజను నమ్మించటంకోసం అపురూపమైన ఏవో మూలికలు చేతపట్టుకవచ్చి చూపిస్తారు.

## సర్పరాజులు : సిరిసంపదలు

సర్పారాధనవల్లనే కుంభవృష్టిగా వర్షిస్తుందని నేపాళ దేశస్థుల మరిఒక నమ్మిక. వారు పామును చంపనే చంపరు. అది మహాపాపం. దీనికి మరణశిక్ష తప్ప మరొక ప్రాయశ్చిత్తం లేనేలేదంటారు.

వర్షాలు కురియటంవల్లనే దేశం సుభిక్షంగా వుంటుంది. అనగా సిరిసంపదలతో, పాడిపంటలతో తులతూగుతూ కల కల్లాడుతూ వుంటుంది. దీని కంతటికీ కారకులైనవారు సర్ప

రాజులే కనుక, పాముపూజలు అవశ్యం చేసి తీరాలని ఆ ప్రాంతాల కొండజాతులవారు అక్షరాలా విశ్వసిస్తున్నారు.

## హరివిల్లే సర్పదైవం

పర్షియా దేశస్థులకు పురాతనకాలంలో ఒక వింత నమ్మకం ఉండేది. రంగురంగులతో ఆకాశంమీద వెలిసే ఇంద్ర ధనుస్సే సర్పదేవుడట ! ఆఫ్రికాదేశపు ఆటవికులలోకూడా ఇటు వంటి సంప్రదాయమే ప్రబలివున్నది. హరివిల్లు అనేదే సర్ప దేవుడు. ఈ దేవుడే ధనధాన్యాది సంపదలను అనుగ్రహించగల అధిపతి. ఈయన తన తలను మేఘాల లోపలకంటా జొనిపి, తన శక్తిసామర్థ్యాలవల్ల వర్షాన్ని భూలోకానికి దింపుతున్నా డని అంటారు వారు.

## రోమ్ - స్వీడన్ దేశాలలో

పోతే - నాగరకతకూ, సంస్కృతికీ ముందంజ వేసినట్లు పేరుపడిన రోమ్‌దేశంలో మరీ వింతవిశ్వాసాలు వ్యాప్తి కన్నవి. మానవుని జీవితమే పాముదేముని దయమీద ఆధారపడివున్న దని వారి సంపూర్ణ విశ్వాసం.

పదహారవ శతాబ్దిలో స్వీడన్ దేశస్థులు . ఇంటింటా శ్రద్ధా భక్తులతో నాగపూజ జరిపేవారనటానికి ఎన్నో నిదర్శనా లున్నవి. పామును చంపటంకంటె మహాపాతకం మరొకటి లేనే లేదని వారి వాదన.

## అంత్యక్రియలు : పాముల ప్రాముఖ్యత

జావా సమీపంలో వుండే బాలీద్వీపంలో పాములను గురించిన విశ్వాసాలు మెండు. అక్కడ క్షత్రియులు పరమ

పదించినపుడు ఒక పామును వెంట కొనిపోయి, మనిషి శవంతో పాటు పామునీ దహనం చేస్తారు.

ఆఫ్రికాదేశపు కొండజాతులలో పాదుకొనిఉన్న ఒక ఆచారం ఇది : వాళ్ళింటికి పాము వస్తే, తమ పెద్దల ఆత్మే ఆ రూపంలో వచ్చినదనే నమ్మకంతో, దానికి గౌరవ మర్యాదలు జరిపిస్తారు.

## పాములు : ఆత్మతృప్తి


పంజాబుదేశంలో కొన్ని ప్రాంతాలవారు పాము చచ్చిపోతే దాని వంటిపైన కొత్తబట్ట కప్పి, మనుష్యులకులాగానే ఖననక్రియలు జరుపుతారు.

చనిపోయిన పామువలన ఎటువంటి కీడూ మూడకుండా వుండేటందుకుగాను, దాని నోటిలో ఒక రాగిడబ్బు పెట్టి, పూజలు సల్పి ఊరేగింపులు చేయటం, అటుతరువాత దహనం చేయటమూ, అక్కడ కొన్ని ప్రాంతాలలో ఈనాటికీ ఆచారంగా వుంటున్నది.

## పాములు : బోధిసత్వుడు

ఒకానొక జన్మలో బోధిసత్వుడే పామురూపం తాల్చినట్టు 'జాతక కథల'లో చెప్పబడుతున్నది.

తరువాత—బౌద్ధమతావలంబులలో చాలామంది సర్పారాధకులే ఐవున్నట్టు చరిత్రలు ఋజువు చేస్తున్నవి. శివలింగములకు పడగలు పట్టినట్టే బుద్ధునికికూడా పడగలు పట్టినట్టు విగ్రహాలలో ఎన్నోచోట్ల చిత్రింపబడివుండటమే ఇందుకు నిదర్శనమని చెప్పవచ్చు.



గాంగేయం వహ్నిగర్భం శరవణజనితం జ్ఞానశక్తిం కుమారం।
సుబ్రహ్మణ్యం స్కందదేవం గుహమమలగుణం రుద్రతేజస్స్వరూపం।
సేనాన్యం తారకఘ్నం గురుమచలమతిం కార్తికేయం।
షడాన్యం సుబ్రహ్మణ్యంమయూరధ్వజ రథసహితం దేవదేవంనమామి॥

# కోరిన కోరికలు

ఇంతవరకూ కూడినంతలో సమగ్రంగా, పామును గురించి సాహిత్య దృష్ట్యా ముచ్చటించి వున్నాము. ఇటుపైన-ముముక్షువులకు ముదము కూర్చే పారమార్థిక విషయాలు కూడా కొద్దిపాటి వివరించటానికి కుతూహలపడుతున్నాను.

సనాతనధర్మనిరతులు, పరమాత్మస్వరూపులు, మోడేకుర్రు వాస్తవ్యులు ఐన శ్రీ నిమిషకవి వెంకయ్య పంతులుగారు ప్రకటించిన 'సుబ్రమణ్యాచరిత్ర' అనే పుస్తకానికి ఉపోద్ఘాతం వ్రాస్తూ, మిత్రులు శ్రీ కామర్షి వేంకటసుబ్బయ్యగారు ఇలా అంటున్నారు :

'విషయము అమూల్యమైనది. ముముక్షువులకు మార్గదర్శి. జనసామాన్యమునకు ఇష్టకామ్యార్థసిద్ధి సమకూర్చి, వారల తరింపజేయగల సాధనము. శ్రీ సుబ్రహ్మణ్యస్వామి మహిమలు ప్రత్యక్ష ప్రమాణములు. ఈ స్వామిని భక్తితో కొల్చినవారలకు కోరిన కోరికలు సఫలములగును. సంతానార్థులగువారలకు తప్పక సంతానము కలుగును. రోగపీడితులకు పరిపూర్ణారోగ్యము కలిగి వారు సుఖింతురు. నిష్కామనయా (ప్రతిఫలము కోరక) పూజించువారలకు సకల సౌభాగ్యములును, సుజ్ఞానమును కలుగును...గీతలయందు శ్రీ కృష్ణభగవాను డానతిచ్చినట్లు, ఈ మహానీయుని అనుకరించి సర్వజనులు శ్రీ సుబ్రహ్మణ్యస్వామిని సేవించి, చరితార్థులగుటకు సందియము లేదు.'

వెంకయ్యపంతులుగారు ఒకప్పుడు గన్నవరమందలి శ్రీ సుబ్రమణ్యేశ్వరుని ఆలయానికి వెళ్లి, స్వామిని దర్శించి, వ్రాసిన విషయాలు గమనింపతగి ఉన్నవి. వా రిలా చెప్పారు:

"ఆ స్వామికిఁ బ్రతిదినమును జరుగుచున్న పూజా విధానమును అర్చకునివలనఁ దెలిసికొని, అపరిమితానందమును బొందితిని. ఆ సుబ్రహ్మణ్యేశ్వరుని విగ్రహము పరిపూర్ణ కళా విరాజమానమై శోభిల్లుచున్నది. భగవంతుఁడు అఖండైక తేజోరూపమున సర్వమయుఁడై సర్వవ్యాపకుఁడై యున్నవాఁడగుటం జేసి సగుణోపాసకులకు అర్చారూపమున బ్రసన్నుఁడగుననుట కిది నిదర్శనము. శ్రీ గరుడేశ్వరస్వామి విషయమై తెలిసికొనవలసిన రహస్య మేమనగా :—

## పాముపడగ : అంతరార్థం

అఖండ గౌతమీ శాఖయగు వసిష్ఠానదినుండి వైనతేయనదిని తెచ్చెననియు, ఆ వైనతేయుఁడు గన్నవరమున శ్రీ గరుడేశ్వరస్వామిని ప్రతిష్ఠించెననియు బ్రతీతి కలదు. గరుడేశ్వరుఁడనఁగా ప్రతి మనుజునియొక్క సహస్రారకర్ణిక (బైందవము) యందుఁ గల పార్వతీ పరమేశ్వరులని భావము. మూలాధారము నుండి సహస్రారమువఱకు వెన్నెముక (బ్రహ్మదండి) మధ్య నుండి సర్పాకారముగ వ్యాపించియుండు కుండలినీశక్తి యనఁబడు సుషుమ్నానాడియే సుబ్రహ్మణ్యేశ్వరుఁడు, కుమారస్వామి.

అజ్ఞానదశయందు మనస్సు ప్రపంచాభిముఖమై యుండుటం

జేసి వృత్తులన్నియు నీ సుషుమ్నామార్గమున అధోముఖవ్యాప్తి కలిగియుండునపుడు కుండలినీ (సర్పము = సుబ్రహ్మణ్యము) పుచ్ఛము సహస్రారమందును శిరస్సు మూలాధారమందును గలిగియుండును. సమాధినిష్ఠ (జ్ఞానావస్థ) యందు పుచ్ఛము మూలాధారమందును, శిరస్సు సహస్రారమందును గలిగియుండును. కనుక నప్పుడు సర్పాకారుఁడగు సుబ్రహ్మణ్యుఁడు తన పడగ సహస్రారకర్ణికయందుండు శివునిపై గలిగియుండును. ఈ కారణమువలన శివుఁడు నాగాభరణుఁడయ్యెను. శివున కాభరణమగుటచేత సర్పరూపియగు సుబ్రహ్మణ్యునకు పూజ్యత కలిగెను. ఈ సుబ్రహ్మణ్యేశ్వర ప్రతిష్ఠచే శ్రీ గరుడేశ్వరస్వామి యొక్క కళలు ద్విగుణీకృతములై విరాజిల్లుచున్నవి.''

దేవుళ్ళందరిలో సుబ్రహ్మణ్యస్వామినే ప్రజ ఎక్కువగా పూజించటానికి గల కారణాలు నిరూపిస్తూ, వారు ఇలా వ్రాస్తున్నారు:

''ప్రతిఫలము కోరి భక్తి శ్రద్ధలతో నుపాసించినయెడల కోరిన కోరికలు సిద్ధించును. మరియు మూలాధారచక్రము నందున్న శివ, పార్వతీ, విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యమూర్తులలో సుబ్రహ్మణ్యస్వామి విశేషభూతదయాపరుఁడై, భక్తుల యభీష్టములను శీఘ్రముగ నొనగూర్చుటంబట్టి సర్వశాఖలవారు సుబ్రహ్మణ్యం, సుబ్బారాయుఁడు, శేషయ్య మొదలగు నామములను ధరించుచు ధ్యానించుచున్నారు. బిడ్డల యంగరక్షణ కొఱకు సుబ్రహ్మణ్యస్తవములఁ బఠించి విభూతులను పెట్టుచున్నారు. ఇట్టి కారణములనుబట్టియె జనసామాన్యము తరించుటకై ప్రతిగ్రామమునందును దేవాలయములు యేర్పడినవి.''

ఇదిగాక - స్వామి మహిమలను వర్ణించే కొన్ని విశేషాం శాలలో శ్రీ పంతులుగారు చెప్పిన ముఖ్యమైన పదింటిని, వారి మాటలలోనే ఇక్కడ ఉదహరిస్తున్నాను :—

(1) అనేక గ్రామాలలో శివకేశవాలయముల వలెనే సుబ్రహ్మణ్యాలయములు స్థాపింపబడి నిత్యారాధనలు ఉత్సవములు తీర్థములు జరుపఁబడుచున్నవి.

(2) కార్తీక శుద్ధ చవితి నాగులచవితి యనియు, మార్గశిర శుద్ధ షష్ఠి సుబ్రహ్మణ్యషష్ఠియనియు, నీ దినములందు వ్రతముల సల్పి, అభిషేకాదులు చేసి, ఉపవాసము లుండి (ముఖ్యముగ స్త్రీలు) సుబ్రహ్మణ్యుని ఆరాధించుచున్నారు. పాములుండు పుట్టలలో పాలు, చలిమిడి సమర్పించుచున్నారు. శూద్రులలో కొందఱు కోడిగ్రుడ్లను సమర్పించుటయు, ఒకానొకప్పుడు సర్పములు పుట్టలోనుండి బయటికి వచ్చి, మనుష్యుల కెట్టి యపాయమును గలిగించకుండ, వారి హస్తములనుండి కోడిగ్రుడ్లను కరచుగొని పోవుటయు గలదు. ఇంకను నిట్టి ప్రత్యక్ష ప్రమాణము లెన్నియో గలవు.

(3) కొందఱు మహాసీయులు సుబ్రహ్మణ్యేశ్వరుడే పరమోత్కృష్టగతి యని యారాధింతురు. మా తండ్రిగారు గొప్ప తపస్వి. శాస్త్రసంప్రదాయములు బాగా తెలిసినవారు. ఆయన ప్రతి షష్ఠి యుపవాసము చేసేవారు. ప్రతిదినము శ్రీ సుబ్రహ్మణ్య విగ్రహమునకు నివేదన చేసేవారు.

(4) గ్రామదేవతల గుళ్ళలోని గరగలకు నాగాభరణములు మాత్రమే యుంచుదురు.

(5) హిందువుల వివాహాది శుభకార్యములయందు నుపయోగింపబడు "పెండ్లిపల్లకీ"ల కమర్చబడిన వెదురు బొంగు సర్పాకారముగ నుండును. ఆ వెదురు బొంగు సుషుమ్నా నాడీ (కుండలినీ) సూచితము. ఆ పల్లకీలో కూర్చుండు శుభ దంపతులు లక్ష్మీనారాయణ స్వరూపులని దలంతురు.

(6) ఈ సుషుమ్నానాడియే బైందవచక్రమం దుండు ప్రత్యగాత్మ స్వరూపుడగు శ్రీ మహావిష్ణువునకు శేషశయ్య యని పురాణప్రసిద్ధి.

(7) యజ్ఞాదిక్రతువులలో సుబ్రహ్మణ్యస్వామికి హవిర్భాగము నర్పింతురు.

(8) నిత్యము జరుపబడు పంచాయతన దేవతార్చనలో కొందరు సుబ్రహ్మణ్య విగ్రహమునుగూడ నుంచి పూజింతురు.

(9) శ్రీ వేంకటేశ్వరస్వామికి మ్రొక్కుకొని ముడుపులు కట్టినట్లే సుబ్రహ్మణ్యస్వామికి గూడ మ్రొక్కి ముడుపులు కట్టుటయు రివాజుగ నున్నది.

(10) రోగనివృత్తికొఱకును, సంతానప్రాప్తికిని, ఇష్టకామ్యార్థసిద్ధికొఱకును, బంగారు రేకులమీదగాని, రాగి రేకులమీదగాని, ఆయా కామ్యముల ననుసరించి సుబ్రహ్మణ్య యంత్రములను లిఖించి ధూపదీపనైవేద్యము లిచ్చి తాయెత్తులలో నిడి ధరించుటయు, అందువలన ఫలప్రాప్తి గలుగుటయు గలదు. శ్రీ సుబ్రహ్మణ్యస్వామినిం గూర్చి యిట్లు నానావిధాచారములు వాడుకలో నున్నవి. వారి వారల భక్తి శ్రద్ధల ననుసరించి ఫలప్రాప్తి కలుగును."

తరువాత—ఇంతవరకు మనం తెలుసుకొన్న పాము

చరిత్రనే మన పూర్వులు 'అష్టోత్తరశతనామావళి'లో ఇమిడ్చి, పూజార్హంగా తయారుచేశారు. ఇందులో మనకు ఆయా సర్ప రాజుల నామాంతరాలు కనిపిస్తాయి. వారి వారి గుణగణాలు వినిపిస్తాయి. వారికీ పురాణగాథలకూ గల సందర్భాలు గోచరిస్తాయి. కాబట్టి, భక్తి ముక్తి ప్రదమైన శ్రీ సుబ్రహ్మణ్యాష్టోత్తర శతనామావళి నిట పొందుపరుస్తున్నాను:

## శ్రీ సుబ్రహ్మణ్యాష్టోత్తర శతనామావళిః

1 ఓం సుబ్రహ్మణ్యాయనమః
2 ఓం ఆదిశేషాయనమః
3 ఓం మహతేనమః
4 ఓం దర్వీకరేశ్వరాయనమః
5 ఓం అహయేనమః
6 ఓం పృథాకవేనమః
7 ఓం భుజగాయనమః
8 ఓం వ్యాళాయనమః
9 ఓం అనంతాయనమః
10 ఓం వాసుకయేనమః
11 ఓం దక్షకాయనమః
12 ఓం కాద్రవేయాయనమః
13 ఓం ఫణామణివిభూషితాయనమః
14 ఓం తీక్ష్ణదంష్ట్రాయనమః
15 ఓం శంఖపాలాయనమః
16 ఓం కాళింగాయనమః
17 ఓం భూధరాయనమః
18 ఓం ఫణినేనమః
19 ఓం ద్విజిహ్వాయనమః
20 ఓం గూఢపదేనమః
21 ఓం చక్రిణేనమః
22 ఓం కాంతికాంతాయనమః
23 ఓం భుజంగమాయనమః
24 ఓం కాకోదరాయనమః
25 ఓం చండకోపినేనమః
26 ఓం పన్నగాయనమః
27 ఓం శివభూషణాయనమః
28 ఓం పాతాళవాసినేనమః
29 ఓం శ్రీవిష్ణుపర్యంకాయనమః
30 ఓం బ్రహ్మస్తుతాయనమః
31 ఓం ఆశీవిషాయనమః
32 ఓం దందశూకాయనమః
33 ఓం దీర్ఘపృష్ఠాయనమః
34 ఓం బిలేశాయాయనమః
35 ఓం సుపర్ణాయనమః
36 ఓం శివాయనమః
37 ఓం స్వామినేనమః
38 ఓం సుధాత్మనేనమః
39 ఓం అతిభీషణాయనమః
40 ఓం చక్షుశ్శ్రవేనమః
41 ఓం హరిశ్చంద్రసుఖకృతేనమః
42 ఓం నళపీడకాయనమః
43 ఓం బలినేనమః
44 ఓం కరాళదంష్ట్రాయనమః

45 ఓం వేగవతేనమః
46 ఓం వాయుభక్షకాయనమః
47 ఓం కర్కోటకాయనమః
48 ఓం కరాళాస్యాయనమః
49 ఓం వర్మిణేనమః
50 ఓం వేదవిధిప్రియాయనమః
51 ఓం సుపుత్రదాయనమః
52 ఓం సురారాధ్యాయనమః [నమః
53 ఓం సహస్రఫణిమండితాయ
54 ఓం ఉరగేశాయనమః
55 ఓం శివాహ్లాదినేనమః
56 ఓం శిపివిష్టేష్టదాయకాయనమః
57 ఓం అత్రిప్రియాయనమః [నమః
58 ఓం క్షీరాన్ననతత్ప్రియాయ
59 ఓం అతిక్షుధితాయనమః
60 ఓం ధృతరాష్ట్రాయనమః
61 ఓం క్షేమకారిణేనమః
62 ఓం పింగళాయనమః
63 ఓం జిహ్వగాయనమః
64 ఓం వరాయినమః
65 ఓం వాగ్మినేనమః
66 ఓం వంద్యాయనమః
67 ఓం వరదాయనమః
68 ఓం భక్తాభీష్టసుఖప్రదాయనమః
69 ఓం కోమలాంగాయనమః
70 ఓం శుభ్రవర్ణాయనమః
1 ఓం విమలాయనమః
2 ఓం కోటరస్థితాయనమః [నమః
3 ఓం మార్గశీర్షాచ్ఛషష్ఠీజ్యాయ
4 ఓం విషభృతేనమః
5 ఓం నిగమస్తుతాయనమః
6 ఓం విష్ణుప్రియాయనమః
7 ఓం నిరుపమాయనమః
8 ఓం హరయేనమః
79 ఓం హింసాకరాయనమః
80 ఓం శుచయేనమః
81 ఓం కామరూపాయనమః
82 ఓం వేలిహానాయనమః [నమః
83 ఓం విష్ణుశోదరబంధనాయ
84 ఓం గంగోద్భవాయనమః
85 ఓం శివానందదాయినేనమః
86 ఓం నకులశాత్రవాయనమః
87 ఓం నకృష్ణవసుదేవానుగామినే
నమః
88 ఓం వర్ణాదివారణాయనమః
89 ఓం బ్రహ్మణ్యాయనమః
90 ఓం రోగహృతేనమః
91 ఓం దేవాయనమః
92 ఓం కుండలినేనమః
93 ఓం భువనేశ్వరాయనమః
94 ఓం భోగినేనమః
95 ఓం భోగప్రదాయనమః
96 ఓం భూతిదాయినేనమః
97 ఓం భూభృతేనమః
98 ఓం భయాపహాయనమః
99 ఓం భవ్యరూపధరాయనమః
100 ఓం బాలబ్రహ్మచారిణేనమః
101 ఓం బలాధికాయనమః [నమః
102 ఓం నిత్యాన్నదాననిరతాయ
103 ఓం నిరవద్యాయనమః
104 ఓం దయానిధయేనమః
105 ఓం నిరంజనాయనమః
106 ఓం జనాధారాయనమః
107 ఓం కాళీయాయనమః
108 ఓం కుళికస్థిరాయనమః
109 ఓం సరీసృపాయనమః
110 ఓం సర్పరాజాయనమః
111 ఓం శ్రీసుబ్రహ్మణ్యాయనమః

సర్పాన్ని గురించిన ఈ ప్రసక్తిని సమాప్తి చేసేముందు, ఒక్కసారి శ్రీసుబ్రహ్మణ్యస్వామివారిని వినుతించే భక్తిభరితమైన ప్రార్థనగీతలను పఠించి తన్మయులమవుదాం:

## శ్రీసుబ్రహ్మణ్య కరావలంబన స్తోత్రమ్

1 హే స్వామినాథ కరుణాకర దీనబంధో
శ్రీపార్వతీముఖ పంకజ పద్మబంధో।
శ్రీశాదిదేవ గణపూజిత పాదపద్మ
వల్లీసనాథ మమదేహి కరావలంబమ్॥

2 దేవాదిదేవసుత దేవగణాధినాథ
దేవేంద్ర వంద్య మృదుపంకజ మంజుపాద।
దేవర్షి నారదమునీంద్ర సుగీతకీర్తే
వల్లీసనాథ మమదేహి కరావలంబమ్॥

3 నిత్యాన్నదాన నిరతాఖిల రోగహారిన్
తస్మాత్ప్రదాన పరిపూరిత భక్తకామ।
శ్రుత్యాగమ ప్రణవవాచ్య నిజస్వరూప
వల్లీసనాథ మమదేహి కరావలంబమ్॥

4 క్రౌంచాసురేంద్ర పరిఖండన శక్తిశూల
పాశాదిశస్త్ర పరిమండిత దివ్యపాణే।
శ్రీకుండలీ శతులఖండ శిఖీన్ద్రవాహ
వల్లీసనాథ మమదేహి కరావలంబమ్॥

దేవాదిదేవ రథమండల మధ్యవేద్య
దేవేంద్ర పీఠనగరం దృఢ చాపహస్తమ్।
శూరం నిహత్య సురకోటి భిరీడ్యమానం
వల్లీసనాథ మమదేహి కరావలంబమ్॥

5 హీరాది రత్నమణియుక్త కిరీటహారి
కేయూరకుండల లసత్కవచాభి రామ।
హే వీరతారక జయామర బృందవంద్య
వల్లీసనాథ మమదేహి కరావలంబమ్॥

7 పంచాక్షరాది మనుమంత్రిత గాంగతోయైః
పంచామృతైః ప్రముదితేన్ద్ర ముఖైర్మునీంద్రైః
పట్టాభిషిక్త హరియుక్త పరాసనాథ
వల్లీసనాథ మమదేహి కరావలంబమ్॥

8 శ్రీకార్తికేయ కరుణామృత పూర్ణదృష్ట్యా
కామాదిరోగ కలుషీకృత దుష్టచిత్తం।
సిక్త్వాతు మామవకళో దధికాంత కాంత్యా
వల్లీసనాథ మమదేహి కరావలంబమ్॥

9 సుబ్రహ్మణ్యాష్టకం పుణ్యంయే పఠన్తి ద్విజోత్తమాః।
తేనర్వేముక్తి మాయాన్తి సుబ్రహ్మణ్య ప్రసాదతః॥

10 సుబ్రహ్మణ్యాష్టకమిదం ప్రాతరుత్థాయ యఃపఠేత్।
కోటిజన్మకృతం పాపం తత్క్షణా దేవనశ్యతి॥

మహత్తరమైనటువంటి, మహిమాన్వితమైనటువంటిన్నీ పామును గురించి ఇంతగా ముచ్చటించిన తరువాత, మతవిష యకమైన ఒక చిన్న పాముసామెతను పేర్కొనక తప్పదు. 'పాము ఎన్ని మెలికలు తిరిగినా తన కన్నంలోకే పోతుం'దని నాడుక. ఈ మాటను ఇలా సమన్వయించుకోవచ్చు: 'మతాలు ఎన్ని ఉన్నప్పటికీ, అవన్నీ మనలను ఈశ్వరసాన్నిధ్యానికే గొనిపోతవి' అని.

ఈ పుస్తకము కూర్చుటలో తోడుపడిన గ్రంథములు కృతజ్ఞతతో పేర్కొనబడుతున్నవి :

గేయములు—శ్రీ బసవరాజు అప్పారావు
వస్తుగుణ ప్రకాశిక—శ్రీ వేటూరి వాసుదేవశాస్త్రి
సంస్కృత లోకోక్తులు—డా॥ చిలుకూరి నారాయణరావు
సుబ్రమణ్య చరిత్ర—శ్రీ నిమిషకవి వెంకయ్యపంతులు
ఆణిముత్యాలు—శ్రీ చల్లా లక్ష్మీనారాయణశాస్త్రి
మహాప్రస్థానం—శ్రీ. శ్రీ.
తెలుగు సామితెలు—Capt. Carr (వావిళ్ల)
ఆంధ్ర లోకోక్తిచంద్రిక—శ్రీ నందిరాజు చలపతిరావు
ఆనందదీపిక—శ్రీ రెంటాల వెంకటసుబ్బారావు
చాటుపద్యమణిమంజరి—శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి—


ఇవిగాక శ్రీమదాంధ్ర మహాభాగవతము, భారతము, ప్రబంధములు, భర్తృహరి సుభాషితము—సుమతి, భాస్కర, వేమన, వేంకటేశ, శరభాంకలింగ, జగన్నాయక—మొదలైన శతకములు, స్త్రీల పాటలు, పిల్లల పాటలు, పాతపాటలు-మరి ఎన్నో పత్రికా వ్యాసములు.

* *
*

# ONDERS IN LITERATUR

# The Animal Kingdom

# హిత్యంలో జంతుజాల




(రెండు భాగములు)

మొదటి భాగంలో: ఏనుగు - కుక్క - నక్క - పిల్లి - ఎలుక - ఆవు - ఎద్దు - మేక - గొర్రె - గాడిద - గుర్రం—ఈ జంతువులనుగురించిన సాహిత్య విశేషాలు పొందుపరుపబడినవి.

రెండవ భాగంలో: సింహం - పులి - దున్న - బర్రె - కోతి - లేడి - కుందేలు - మత్స్యం - కూర్మం - వరాహం మొదలగు జంతువులగురించిన సాహిత్య విశేషాలు చిత్రింపబడినవి.

by M.S.SASTRY



INDIRA GANDHI MEMORIAL LIBRARY
UNIVERSITY OF HYDERABAD
LIBRARY
T HYDERABAD (A. P.)

Cl. No. 808.5036 Acc. No. 6054
S78S DATE DUE

DURATION OF LOAN — Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |

UNIVERSITY OF HYDERABAD, LIBRARY

T

Acc. No. 3054

Call No. 808.8036 S785

Author [illegible]

Title [illegible]

| Due on | Returned on | Due on | Returned on |
| --- | --- | --- | --- |

INDIRA GANDHI MEMORIAL LIBRARY

UNIVERSITY OF HYDERABAD

LIBRARY

HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.
2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defacted or lost.

**Help to keep this book fresh & clean**